# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 129 పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం- 15 - మే - 2025


## జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- 14వ తేదీన భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు.
- ఈ నెల 30 తేదీ నాటికి దాదాపు 60 శాతం భూ సమస్యలను పరిష్కరిస్తామని,
- భూ భారతి చట్టం పరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన వచ్చే నెల 2వ తేదీ నుంచి భూ భారతి చట్టంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు

## కాళేశ్వర త్రివేణి సంగమంలో
# సీఎం రేవంత్ రెడ్డి పుణ్యస్నానం

- కాళేశ్వరం త్రివేణి సంగమంలో సరస్వతి ఘాట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుణ్యస్నానం ఆచరించేందుకు ఈ ప్రదేశాన్ని సందర్శించనున్నారు.
- పుష్కర స్నానాలను ప్రతి రోజు ప్రాతఃకాలం ప్రారంభం నుండి ప్రారంభించాలి.
- కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు ప్రతి 12 సంవత్సరాల తరవాత సంభవిస్తాయి.



వివరాలు 2లో..

హైదరాబాద్: : జయశంకర్ భూపాల్ పల్లి జిల్లాలో ఉన్న కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో మే 15వ తేదీన ప్రారంభం కానున్న సరస్వతీ పుష్కరాలు విశేష ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ పుష్కర ఘాట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం కాళేశ్వర త్రివేణి సంగమంలో నిర్వహించబడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుణ్యస్నానం ఆచరించేందుకు ఈ ప్రదేశాన్ని సందర్శించనున్నారు. ఆయన సందర్శనతో పుష్కరాల ఉత్సవం మరింత వైభవంగా సాగనుంది. కాళేశ్వరం త్రివేణి సంగమంలో సరస్వతి ఘాట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ ఘాట్ ప్రారంభంతో పాటు 12 యేళ్ల తరువాత జరుగుతున్న సరస్వతి పుష్కరాలు ప్రారంభమవుతాయి. పుష్కర కాలం 12 రోజుల పాటు ఉంటుంది, ఇందులో విశేష ఆధ్యాత్మికమైన వేళలు, యాగాలు ,

## మరో ఐదురోజులు వానలే..
## హెచ్చరించిన ఐఎండీ హైదరాబాద్



- మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.
- రాగల మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం
- గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది.

## చైనాకు భారత్ షాక్..
## ఇది మామూలు దెబ్బ కాదు



- చైనాకు బిగ్ షాక్ ఇచ్చింది భారత్.
- పాకిస్థాన్‌తో పాటు అరుణాచల్ ప్రదేశ్ విషయంలో తమను రెచ్చగొడుతున్న డ్రాగన్‌కు గట్టిగా బుద్ధి చెప్పింది ఇండియా.
- అధికార న్యూస్ ఏజెన్సీ జిన్‌హువా ఎక్స్ అకౌంట్లను బ్లాక్ చేసింది మోదీ సర్కారు.

ఢిల్లీ : చైనాకు గట్టిగా బుద్ధి చెప్పింది భారత్. ఆపరేషన్ సిందూర్ మీద తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్న డ్రాగన్ కంట్రీకి సంబంధించిన న్యూస్ ఏజెన్సీలను ట్విట్టర్‌లో బ్లాక్ చేసింది. చైనాలోని అధికార కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన గ్లోబల్ టైమ్స్ అనే ఆంగ్ల పత్రికతో పాటు ఆ దేశ అధికార న్యూస్ ఏజెన్సీ జిన్‌హువా ఎక్స్ అకౌంట్లను బ్లాక్ చేసింది మోదీ సర్కారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం, ధృవీకరించకుండానే సమాచారాన్ని వ్యాప్తి చేయడం విషయంలో చైనాపై ఇప్పటికే అక్కడి భారత ఎంబసీ మండిపడింది. ఆపరేషన్ సిందూర్ మీద కొన్ని పాకిస్థాన్ అనుకూల వర్గాలు నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది.

## వ్యవసాయ రంగంలో
# ఏపీ నంబర్‌వన్?

-పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది

-నిత్య విద్యార్థిలా ఎల్లప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ

-సాంకేతిక యుగంలో సమర్థత అవసరం

-ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త రావాలి

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




అమరావతి : వ్యవసాయ రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఏపీ ఉందని, పరిశ్రమలు కూడా వస్తే రాష్ట్రానికి ఆదాయం సమకూరి ఉపాధి పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని పశు సంవర్ధకక శాఖ టెక్ ఏఐ2.0 కాంక్లేవ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'పాత్ వేస్ టు ప్రాస్పెరిటీ', నెక్స్ట్- జెన్ యానిమల్ హస్బెండ్రీ', 'విజనరీ' అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పశు సంవర్ధక విభాగంలో సమ్మిళిత, స్థిరమైన వృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు, పేదరిక నిర్మూలన వంటి వాటిపై రాసిన ఈ పుస్తకాలు ఉపయోగపడతాయ న్నారు. మిగతా..2లో

### స్టార్ హాస్పిటల్స్ నిర్వహించిన 'స్టార్ హెల్త్ కేర్ క్వాలిటీ ఎంక్లేవ్ 2025' విజయవంతం

సాంకేతికత ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమన్నారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్ లోనే నని చెప్పారు. గతంలో ఏ పని చేయాలన్న ప్రభుత్వం అనుమతి అవసరమన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు రాగానే మార్పులు వచ్చాయని తెలిపారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం తీసుకున్నామని తెలిపారు.

## ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు, భారీ ప్రాణ నష్టం



- మృతుల్లో 22 మంది చిన్నారులు
- గాజాలో యుద్ధం ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టీకరణ
- 22 మంది చిన్నారులు ఉన్నారని స్థానిక ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న ఘర్షణలతో గాజా ప్రాంతం మరోసారి దాడులతో దద్దరిల్లుతోంది. ఉత్తర గాజాలోని నివాస ప్రాంతాలపై మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలోని జబాలియా ప్రాంతంలో ఇళ్లపై వైమానిక దాడులు జరిగాయి. ఈ దుర్ఘటనలో 48 మంది పౌరులు మరణించగా, వారిలో 22 మంది చిన్నారులు ఉన్నారని స్థానిక ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అనేక నివాస భవనాలు ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు.

## మూడు రోజులపాటు మహానాడు..
# ఆరు కమిటీలకు బాధ్యతలు



- 27, 28, 29 తేదీల్లో నిర్వహణకు నిర్ణయం
- ఆరు కమిటీలకు బాధ్యతలు
- మహానాడు ఏర్పాట్లపై లోకేష్ దీర్ఘ చర్చ
- కడపలో మహానాడుపై నేతలకు దిశానిర్దేశం

అమరావతి : కడపలో పండుగ వాతావరణంలో తెలుగుదేశం పార్టీ మహానాడును నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలవురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది.

## జగన్‌కు బిగ్ షాక్..
# చంద్రబాబు సర్కార్ ఆదేశాలు

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు బిగ్ షాక్ తగిలింది.

కడప మేయర్ కే సురేష్ బాబుతోపాటు మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌ను పదవుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



అమరావతి, మే 14: మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌కు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తురకా కిషోర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఏపీ మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 16(1)(క )ను ఉల్లంఘించినందుకు అతడిని ఈ పదవి నుంచి తొలగించినట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గత 15 మున్సిపల్ కౌన్సిల్ మీటింగులకు ఆయన హాజరు కాలేదని తేలడంతో ఈ పదవి నుంచి అతడిని తొలగించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం తురకా కిషోర్ పోలీసుల అదుపులో ఉన్నట్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు ఛైర్మన్ అధికారాలను దుర్వినియోగం చేసిన కేసులో చర్యలు ఎందుకు తీసుకోకూడదంటూ ఇప్పటికే తురకా కిషోర్‌కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై అతడి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తురకా కిషోర్‌ను మాచర్ల ఛైర్మన్ పదవి నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నూతన సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్...
# శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



- సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్
- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ: భారతదేశ నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (బీఆర్ గవాయ్) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నియామకంతో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 52వ చీఫ్ జస్టిస్ గా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ గవాయ్ ఈ పదవిని అలంకరించిన తొలి బౌద్ధ మతస్థుడు కావడం, అలాగే షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఈ స్థాయికి చేరిన రెండో వ్యక్తి కావడం విశేషం. నిబంధనల ప్రకారం, రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో రాష్ట్రపతి, జస్టిస్ గవాయ్‌తో భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర న్యాయ ప్రముఖులు, ఉన్నతాధికారులు మరియు జస్టిస్ గవాయ్ కుటుంబ సభ్యులు హాజరైనట్లు సమాచారం.

## చైనాకు భారత్ షాక్..

# ఇది మామూలు దెబ్బ కాదు

అలాంటి సమాచారాన్ని వెరిఫై చేయకుండా వ్యాప్తి చేయడం సరికాదని, ఇది బాధ్యతాయుతమైన పాత్రికేయం అనిపించుకోదంటూ చైనీస్ మీడియాను దుయ్యబట్టింది.

### భారత ఎంబసీ కోరినా..

ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దంటూ చైనాలోని భారత ఎంబసీ కోరినా ఏ మార్పు రాలేదు. డ్రాగన్ కంట్రీకి చెందిన న్యూస్ ఏజెన్సీలు ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయడంతో మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్‌తో పాటు జిన్‌హువా న్యూస్ ఏజెన్సీని ట్విట్టర్‌లో బ్లాక్ చేసేసింది.

### ఢీ అంటే ఢీ..

అరుణాచల్ ప్రదేశ్ విషయంలో రెచ్చగొడుతున్న చైనాకు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ ఇండియా పైకి ఉసిగొల్పుతున్న డ్రాగన్ కంట్రీ.. అరుణాచల్ అంశంలోనూ మనల్ని ఇబ్బంది పెడుతోంది. కాబట్టి ఆ దేశంతో ఢీ అంటే ఢీ అనడమే కరెక్ట్ అని సోషల్ మీడియాలో కామెంట్స్ వస్తున్నాయి. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల పేర్లను మార్చింది చైనా. అసలే పాకిస్థాన్ చేసిన అతితో సీరియస్‌గా ఉన్న ఇండియాను పేర్ల మార్పుతో రెచ్చగొట్టింది డ్రాగన్. దీనిపై మోదీ సర్కారు ఆగ్రహం వ్యక్తం చేసింది. చైనా వ్యర్థ, విఫలయత్నాలను గమనిస్తున్నామని పేర్కొంది. అరుణాచల్ ఎప్పటికీ తమ భూభాగమేనని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలు మారవంటూ డ్రాగన్‌కు ఇచ్చిపడేసింది.

## నూతన సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్...

# శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

ఈ సందర్భంగా నూతన సీజేఐ బీఆర్ గవాయ్ కి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. “భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యాను. ఆయన పదవీకాలం అత్యంత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను” అని ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

## ఉత్తర గాజాపై ఇజ్రాయెల్

# వైమానిక దాడులు, భారీ ప్రాణ నష్టం

అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన ఒప్పందంలో భాగంగా హమాస్ ఒక ఇజ్రాయెల్-అమెరికన్ బందీని విడుదల చేసిన కొద్దిసేపటికే ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు, గాజాలో యుద్ధాన్ని ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. దీంతో యుద్ధ విరమణ ఒప్పందంపై నెలకొన్న ఆశలు సన్నగిల్లాయి. ఇటీవల ఇజ్రాయెల్‌పై హూతీలు జరిపిన దాడుల పట్ల నెతన్యాహు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హూతీలను కచ్చితంగా ఎదుర్కొంటామని, గతంలో ఐడీఎఫ్ చేసిన దాడులను వారు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈసారి దాడులు తీవ్రంగా ఉంటాయని, బాంబుల మోతలతో హోరెత్తిస్తామని ఆయన అన్నారు.

# జగన్‌కు బిగ్ షాక్.. చంద్రబాబు సర్కార్ ఆదేశాలు

2019 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పల్నాడులోని మాచర్లలో టీడీపీ సీనియర్ నేతలు బోండా ఉమా, బుద్దా వెంకన్న పర్యటించారు. ఈ సందర్భంగా వారి పర్యటిస్తున్న కారుపై తురకా కిషోర్ దుడ్డు కర్రతో దాడి చేశాడు. ఈ కేసులోనూ అతడు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగే వైసీపీ నేత, కడప మేయర్ కే సురేష్ బాబుపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ పదవి నుంచి ఆయన్ని తొలగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించిన అంశంలో సురేష్ బాబుపై అనర్హత వేటు వేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు పనులు అప్పగించిన అంశంలో మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మేయర్ సురేష్ బాబును మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్ అమరావతిలో విచారించారు. అయితే తనకు రెండు వారాల గడువు కావాలని మేయర్ కోరారు. మేయర్ వివరణపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ఆయన్ని సైతం కడప మేయర్ పదవి నుంచి తొలగిస్తూ.. ఉత్తర్వులను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలు కావడంతో.. ఆ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇప్పటికే పలువురు అగ్రనేతలు ఆ పార్టీని వీడిరు. తాజాగా అంటే.. మే 14వ తేదీన వైసీపీ ఎమ్మెల్సీ జాకీయా ఖానమ్.. తన పదవికి రాజీనామా చేశారు. ఆమె మండలిలో డిప్యూటీ చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జాకీయా ఖానమ్.. తన ఎమ్మెల్సీ పదవికి ఇంత అకస్మాత్తుగా రాజీనామా చేయడంతో పార్టీలో కలకలం రేగింది.

# వ్యవసాయ రంగంలో ఏపీ నంబర్‌వన్?

అప్పుడే వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనులైన సులువుగా చేసుకుని పరిస్థితి వచ్చిందని తెలిపారు. గతంలో రోడ్లు గుంతలుగా ఉండేవని, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో వాటిని చక్కగా నిర్మించారని వివరించారు. తాను నిత్య విద్యార్థిని అని, ఎల్లప్పుడూ నేర్చుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

### ఏపీ పాలిసెట్ ఫలితాలు విడుదల.. ఇలా చెక్ చేసుకోండి

### పేదరికం లేని సమాజమే లక్ష్యం

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి అనేది తన ధ్యేయమన్నారు. ఇష్టపడి పని చేస్తే కష్టం ఉండదని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ లో ఇప్పటికే 330 సర్వీసులు ఇస్తున్నామని, మరి కొద్ది రోజుల్లో 400కు పెంచుతామని వెల్లడించారు రెండు మూడు నెలల్లో వాట్సప్ గవర్నన్స్?పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలని పిలుపునిచ్చారు. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో మైక్రో ఇరిగేషన్ కు ఆంధ్రప్రదేశ్ చిరునామా కావాలని ఆకాంక్షించారు. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు

## కాళేశ్వర త్రివేణి సంగమంలో

# సీఎం రేవంత్ రెడ్డి పుణ్యస్నానం

ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి 11.00 గంటల వరకు పుష్కర యాగాలు నిర్వహించబడతాయి. ఉదయం 6.45 గంటల నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాలహారతి కూడా ఏర్పాటు చేయబడుతుంది. ఈ కార్యక్రమాలు భక్తులకీ, సందర్శకులకీ ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసాదిస్తాయి. పుష్కర స్నానాలను ప్రతి రోజు ప్రాతఃకాలం ప్రారంభం నుండి ప్రారంభించాలి. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథునరాశిలో ప్రవేశిస్తే, పుష్కరకాలం ప్రారంభమవుతుంది. అంతర్వాహినిగా పరిగణించే సరస్వతి నది కాళేశ్వరం వద్ద ప్రవహిస్తుంది, దీనిని అనుసరించి పుష్కర స్నానాలు 15వ తేదీ ఉదయం 5:44 గంటలకు ప్రారంభం అవుతాయి. పుష్కర స్నానాలను ఆచరించడానికి భక్తుల కోసం తాత్కాలిక టెంట్ సిటీలను ఏర్పాటు చేయబడింది. కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు ప్రతి 12 సంవత్సరాల తరవాత సంభవిస్తాయి. ఈసారి బృహస్పతి జ్ఞానం, ఆధ్యాత్మికత, విద్యకి అధిపతి కాబట్టి, ఆయన నడిపించిన పుష్కరాలు రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరమైనదిగా భావిస్తున్నారు. ఈ పుష్కరాల ద్వారా రాష్ట్రం తన సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి మరింత అవకాశాన్ని పొందుతుంది.

## భూభారతి చట్టం అమలుపై

# మంత్రి పొంగులేటి కీలక ప్రకటన




కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంతో రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ తీరిపోతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంలో భాగంగా గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని బుధవారం ఆయన ఓ ప్రకటన రిలీజ్ చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజైన జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. పూర్తి వార్త కోసం ఈ లింక్‌ను క్లిక్ చేయండి. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన తొలి కేబినెట్ మీటింగ్‌లో సెమీ కండక్టర్ ఇండస్ట్రీకి ప్రోత్సాహమిచ్చేలా ఆమోదం లభించింది. యూపీలోని జేవర్లో 6వ సెమీ కండక్టర్ యూనిట్‌ను నిర్మించేందుకు మంత్రివర్గం ఓకే చెప్పిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకు రూ.3,706 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పూర్తి వార్త కోసం ఈ లింక్‌ను క్లిక్ చేయండి. రెండు కాదు.. 16 రాష్ట్రాల్లో ఉన్నాం.. మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ప్రకటన కాల్పుల విరమణ ప్రసక్తే లేదని, మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టకుండా వారితో శాంతిచర్చలు జరిపే అవకాశం లేదని కేంద్ర హోంశాంఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ ప్రకటించారని గుర్తు చేశారు. అయితే అంతకుముందు ఎటువంటి షరతులు లేకుండా శాంతిచర్చలు జరపడానికి సిద్ధమని ప్రకటించి నేడు అందుకు భిన్నంగా కాల్పుల విరమణ ప్రకటించకుండానే మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టాలని షరతు పెట్టారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లకు పరిమితమైలేదని, దేశవ్యాప్తంగా దాదాపు 16 రాష్ట్రాల్లో పార్టీ పని చేస్తోందని తెలిపారు. అందుకే శాంతిచర్చల విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

## మూడు రోజులపాటు మహానాడు..

# ఆరు కమిటీలకు బాధ్యతలు

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అన్న ఎన్టీఆర్ గారి దగ్గర నుంచి పండుగ వాతావరణంలో మహానాడును నిర్వహించడం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. వసతి, రవాణకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈ సందర్భంగా నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల పాటు మహానాడు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మొదటి రోజు తెలుగుదేశం పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చ జరగనుంది. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు.

### మూడు రోజుల పాటు మహానాడు..

మొత్తం మూడు రోజులపాటు మహానాడు నిర్వహించాలని నిర్ణయించారు. 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. 27 వ తేదీన పార్టీ నిర్మాణం, సంస్థాగత అంశాలపై చర్చిస్తారు. 28 న ప్రభుత్వం సాధించిన విజయాలు, గత ప్రభుత్వ వైఫల్యాలు పై చర్చ నిర్వహిస్తారు. 27, 28 తేదీల్లో ప్రతినిధుల సభ, 29 న భారీ బహిరంగ సభ జరుపుతారు. మహానాడు నిర్వహణకు మొత్తం 6 కమిటీ లను లోకేష్ నియమించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు:

# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మొదటి పేజి తరువాయి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో గత నెల 14వ తేదీన భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే నెల 2వ తేదీ నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టం పరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

### పదవులన్నీ మీ బంధువులకేనా?.. గాంధీ భవన్ లో మహిళా కాంగ్రెస్ నేతల ఆందోళన

### 60 శాతం పరిష్కారం

ప్రయోగాత్మకంగా నాలుగు మండలాల్లో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 30 తేదీ నాటికి దాదాపు 60 శాతం భూ సమస్యలను పరిష్కరిస్తామని, భూభారతి చట్టానికి లోబడి పరిష్కరించవలసిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. పరిష్కరించ లేని వాటికి ఎందుకు కారణాలు లిఖితపూర్వకంగా



దరఖాస్తుదారులకు తెలియజేస్తామన్నారు. ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి, అక్రమమైనవి ఉంటే, అవి పరిష్కారం కావని చెప్తామన్నారు. భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలనేది భూ భారతి చట్టం లక్ష్యం. క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరం స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో దశలో 28 మండలాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో కూడా ఈ నెల చివరి నాటికి వీలైనంత వరకు సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

### ఆపరేషన్ కగార్‌పై సీఆర్పీఎఫ్ డీజీ కీలక వ్యాఖ్యలు

### కోర్టు కేసు తర్వాతే..

సాదాబై నామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అయితే ఆన్ లైన్ లో ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గత ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ విభాగంలో చేపట్టిన సంస్కరణలు, తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. భూ భారతి చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, ఈ చట్టం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న సంతోషం వారిలో కనిపిస్తుందన్నారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయని విమర్శించారు. మొత్తం వ్యవస్థను ప్రజలకు దగ్గరికి చేసి, మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

# మరో ఐదురోజులు వానలే.. హెచ్చరించిన ఐఎండీ హైదరాబాద్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : తెలంగాణలో ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వర్షాల నేపథ్యంలో రాగల మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, యాదాద్రి



భువనగిరి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. మంచిర్యాల, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 16న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని హెచ్చరించింది. అలాగే, శని, ఆదివారాల్లోనూ వర్షాలు కురుస్తాయని

# విరమణకు అంత తొందరెందుకు?

పాకిస్థాన్ ప్రేరేపిత కశ్మీరీ జీహాదీలు పహల్గాంలో 26 మందిని ఊచకోత కోసిన రెండు వారాలకు భారత్ స్పందించింది. ఏప్రిల్ 22న కశ్మీర్ మారణకాండ జరిగితే, మే 7న భారత సైనిక దళాలు పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను దాడులతో ధ్వంసం చేశాయి. అనంతరం పాక్ భూ భాగంలోని లాహోర్ సహా అనేక ప్రాంతాలపై భారత సైన్యం దాడులు చేసి పాక్ ఆర్మీపై పైచేయి సాధించింది. దాయాది దేశంతో యుద్ధం నెలల పాటు కొనసాగాలని ఏ ఒక్క పౌరుడూ కోరుకోడు. 1962, 1965, 1971 యుద్ధాలు భారతదేశాన్ని ఎంతగా దెబ్బతీశాయో ప్రజలకు తెలియనిది కాదు. మనది కాని భూభాగాన్ని తన నియంత్రణలో దీర్ఘకాలం ఉంచుకోవడం ఎంత కష్టమైన పనో ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ప్రాంతాలు నిరంతరం రుజువు చేస్తున్నాయి. అలాంటిది కొందరు భారతీయులు చెబుతున్నట్టు ఈ యుద్ధాన్ని ముందుకు సాగదీసి లాహోర్ సహా అనేక పాక్ ప్రాంతాలను శాశ్వతంగా భారత అధీనంలో ఉంచడం కుదిరే పని కాదు. యుద్ధం ఆపించాలంటూ అమెరికా శరణుజొచ్చిన పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు, రాయితీలు పొందకుండా యుద్ధం ఎందుకు ఆపేశారు? అని ప్రజలు అడుగుతున్నారు. 1999 కార్గిల్ పోరు తర్వాత ఇండియా-పాకిస్థాన్ మధ్య 26 ఏండ్లకు జరిగిన యుద్ధం నాలుగు రోజులకే మే 10న ముగిసిపోయింది. ఉభయ దేశాలూ కాల్పుల విరమణ పాటించనున్నట్టు మొదట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం మధ్యాహ్నం ప్రకటించడంతో యుద్ధం ముగిసిందనే వార్త భారత ప్రజలకు చేరింది. రెండు దాయాది దేశాల మధ్య పోరు ఆగిందనే సమాచారం ప్రపంచ ఏకైక అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్ ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందనే విషయం తర్వాత చర్చించవచ్చుగాని, ఇంత హడావుడిగా ఉరుము ఉరిమినట్టు యుద్ధం నిలిపివేయడానికి భారత ప్రభుత్వం ఎందుకు అంగీకరించాల్సి వచ్చిందో ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర కేంద్ర మంత్రులు, విదేశాంగ కార్యదర్శి వంటి ఉన్నతాధికారులు ఇంతవరకు వెల్లడించలేదు. కిందటి బుధవారం భారత వైమానిక దళం పాకిస్థాన్ పంజాబ్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు జరిపి వాటికి ఎనలేని నష్టం కలిగించి ధ్వంసం చేశాక యుద్ధం తీవ్రమయ్యే దిశగా సాగింది. రెండు భారత ఉపఖండ దేశాల మధ్య యుద్ధం 1971 భారత-పాక్ యుద్ధం మాదిరిగా 13 రోజులకే ముగుస్తుందా? లేక నెల రోజులు సాగుతుందా? అనే ప్రశ్నలు దేశ ప్రజలను ఆలోచనల్లో పడవేశాయి. 140 కోట్ల మందికి పైగా ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన పహల్గాం ఊచకోత తర్వాత భారత సర్కార్ పాకిస్థాన్‌పై ఎట్టకేలకు సైనిక చర్య తీసుకోవడం సబబేననే అభిప్రాయం మెజారిటీ జనానికి కలిగింది. అయితే, నాలుగు రోజుల యుద్ధంలో అన్నివిధాలా భారత్ తిరుగులేని ఆధిక్యం సాధించడం భారతీయులకు ఎంతగానో గర్వకారణమైంది. పాక్ గగనతలం నుంచి దూసుకువస్తున్న డ్రోన్లు, ఇతర విధ్వంసక క్షిపణులను భారత గగన రక్షణ వ్యవస్థ తిప్పికొట్టడం చూసి ఇండియా సైనిక దళాల ఆధునికీకరణ ఇంత బాగా జరిగిందా? అనే ఆలోచన భారత ప్రజలను ఆనందింపజేసింది. 36 గంటల్లో భారత్ దాడి చేస్తుందని చెప్పిన పాక్‌లో లేని యుద్ధ సన్నద్ధత: పహల్గాం మారణకాండ జరిగిన వారానికి పాక్ మంత్రులు, ఉన్నతాధికారులు మరో 36 గంటల్లో ఇండియా తమ దేశంపై దాడి చేయబోతోందని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ప్రకటనలు చేశారు. దేశ ఆవిర్భావం నుంచీ పెత్తనం చేస్తున్న పాకిస్థాన్ ఆర్మీ యుద్ధానికి సన్నద్ధం కాలేదు. ఒకవేళ భారత సేనలు తమపై దాడికి సాహసం చేసినా అవి సర్జికల్ స్ట్రయిక్స్ పేరుతో పిలిచే మెరుపు దాడులకు పరిమితమౌతాయనే భ్రమల్లో పాక్ అధికారులున్నారు. భారత సైనిక దళాల దాడులు పాక్ ఆక్రమిత కశ్మీర్ వరకే సాగుతాయనే ధీమా పాక్ ఆర్మీలో వ్యక్తమైంది. ఇండియా మాదిరిగానే పాకిస్థాన్ కూడా అణ్వాయుధాలున్న దేశం కాబట్టి తమపై భారీ స్థాయిలో దాడికి భారత రక్షణ దళాలు ముందుకురావనే మితిమీరిన నమ్మకం 'పాక్ కమాండర్ల'లో ఎప్పటి నుంచో ఉన్నది. ఆ నమ్మకమే పాకిస్థాన్ నేరుగా భారత్‌పై యుద్ధం చేయకుండా తన చెప్పుచేతుల్లో ఉండే జీహాదీల ద్వారా భారతీయులను గాయపరిచే పనులు చేస్తున్నది. పేరుకే ప్రజాస్వామ్యం ఉన్న ఈ ఇస్లామిక్ రిపబ్లిక్‌లో ఎన్నికైన నాయకులను కీలుబొమ్మలను చేసి పాక్ ఆర్మీ ఆడిస్తున్నది. పాక్‌లోఅనేక మంది ప్రధానులు, అధ్యక్షులు ఎన్నికల్లో ఓడిపోవడం ద్వారా గాక ఆర్మీ ఆదేశాలతో పదవీచ్యుతులవడం ఇటీవల చరిత్రే. 1947 ఆగస్టు మధ్యలో ఇండియాతోపాటే స్వాతంత్ర్యం సంపాదించిన పాకిస్థాన్ రాజ్యాంగ రచన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థను వేళ్లూనుకునేలా చేయడంలో విఫలమైంది. 1953లో లాహోర్ వంటి నగరాల్లో ముస్లిం వర్గాల (అహ్మదీయులకు ఇతర ముస్లింలకు) మధ్య జరిగి హింసాత్మక ఘర్షణల్లో అనేక మంది మరణించారు. 1974లో నాటి జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం ముస్లింలుగా పరిగణించే అహ్మదీయులను ముస్లిమేతరులుగా పార్లమెంట్‌లో చట్టం ద్వారా ప్రకటించడంతో మరోసారి పాక్ నగరాల్లో అల్లర్లు జరిగాయి. ఇలాంటి ఘర్షణల సమయంలో పాక్ ఆర్మీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసి శాంతిని పునరుద్ధరించిన సందర్భాలున్నాయి. అందుకే పాకిస్థాన్‌లో సైనిక పాలన తరచూ విధించడానికి ప్రకటించే మార్షల్ లాను పాక్ జనం దేవుడే తమను సైనిక దళాల జోక్యం ద్వారా కాపాడాడ

# సంపాదకీయం

## ముగిసిన యుద్ధం మిగిల్చిన ప్రశ్నలు

గగనతలంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. యుద్ధ విమానాలు శత్రుస్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించాయి. డ్రోన్‌లు పేలుడు పదార్థాలతో నిప్పులు కక్కాయి. సరిహద్దులు కాల్పులతో దద్దరిల్లాయి. కేవలం నాలుగు రోజుల్లోనే భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. ఇది ఆధునిక యుద్ధతంత్రం కనుక టెక్నాలజీ సాయంతో నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించగలగడం, క్షిపణులను, డ్రోన్‌లను గాలిలోనే పేల్చివేయడం వంటి అపూర్వ దృశ్యాలను మనం చూడగలిగాం. పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన 15 రోజుల్లోనే భారత దేశం సర్వశక్తులను మోహరించి పాకిస్థాన్‌పై దాడులు ప్రారంభించిన వైనాన్ని, పాకిస్థాన్ మనను ఎదుర్కొనే విషయంలో విఫలం కావడం స్పష్టంగా కనపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనిక దళాలు ప్రారంభించిన యుద్ధం మొత్తం దేశాన్నే గగుర్పొడిచేలా చేసింది. భారత మహిళల సిందూరాన్ని తుడిచివేసిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు తగిన పేరే పెట్టినందుకు దేశ వ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. 'ఉగ్రవాదులను, వారికి వెనుక ఉన్న శక్తులను మట్టిలో కలిపేస్తాం' అని ప్రధానమంత్రి చేసిన హుంకారం దేశమంతటా ప్రతిధ్వనించింది. పాకిస్థాన్ కూడా భారత్‌ను ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడంతో ఈ యుద్ధం చాలా కాలం సాగుతుందని, ఈసారి భారతదేశం లాహోర్‌లో ప్రవేశించడమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా కైవశం చేసుకుంటుందనే భావనలు అంతటా పెల్లుబుకాయి. కాని యుద్ధం ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే ఉన్నట్లుండి ఇరు దేశాలు యుద్ధ విరమణను ప్రకటిస్తాయని, శతఘ్నులు, విమానాలు మూగపోతాయని ఎవరూ ఊహించలేదు. ఏదో జరగబోతుందని, ఈసారి పాకిస్థాన్‌కు మనం కనీవినీ ఎరుగని రీతిలో బుద్ధి చెబుతామని భావించిన తరుణంలో పాక్ కాల్పుల విరమణను ప్రతిపాదించడం, అందుకే ఎదురుచూస్తున్నట్లుగా మనం నాటకీయంగా అందుకు అంగీకరించడం దేశ వ్యాప్తంగా అనేకమందికి ఆశ్చర్యం కలిగించింది. నిజానికి మనమే కాల్పుల విరమణను ముందుగా ప్రతిపాదించామని, అందుకు తాము ఒప్పుకున్నామని పాకిస్థాన్ కూడా ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా%-%ఉక్రెయిన్‌ల మధ్య ప్రారంభమైన యుద్ధం ఎంతో బీభత్సం సృష్టించిన తర్వాత ఇప్పుడిప్పుడే శాంతి బాటలోకి పయనిస్తోంది. ఇజ్రాయిల్%-%పాలస్తీనా మధ్య నెత్తుటి సంఘర్షణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. గతంలో ఇరాన్, ఇరాక్‌ల మధ్య యుద్ధం 8 సంవత్సరాలకు పైగా సాగింది. అమెరికా సంకీర్ణ దళాలకూ, ఇరాక్‌కు మధ్య మరో 8 సంవత్సరాలు హోరాహోరీ సాగింది. వియత్నాంపై అమెరికా యుద్ధం కూడా 20 సంవత్సరాలకు పైగా జరిగింది. మరెందుకు భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కేవలం నాలుగు రోజుల్లోనే యాంటీ క్లైమాక్స్ లాగా ఎందుకు ముగిసింది? ఈ యుద్ధం ఇలా అర్థాంతరంగా ముగియడాన్ని బట్టే యుద్ధం గురించి స్వతంత్రంగా మనం నిర్ణయాలు తీసుకోలేమని, తీసుకున్నా దాన్ని కొనసాగించలేమని అర్థమవుతుంది. ఈ యుద్ధ విరమణను భారత పాకిస్థాన్ దేశాలు తమంతటత తాము ప్రకటించాయని అనుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు. ఉన్నట్లుండి కత్తులు ఒరల్లోకి చేరిపోవడం యాదృచ్ఛికం కానేకాదు. అసలు సుదీర్ఘకాలం యుద్ధం జరగాలని, సైనికులు, ప్రజలు చనిపోవాలని, అభివృద్ధి స్తంభించిపోవాలని ఎవరూ కోరుకోరు. ప్రపంచ శాంతి ఏర్పడాలనే అందరూ కోరుకుంటారు. గతంతో పోలిస్తే ఒకటి రెండు చోట్ల తప్ప ప్రపంచంలో యుద్ధ వాతావరణం అంతగా లేదు. చైనా, అమెరికా లాంటి దేశాలు వాణిజ్య భాషకే ప్రాధాన్యతనిస్తున్నాయి. భారత దేశం కూడా వికసిత్ భారత లక్ష్యం నెరవేరాలంటే యుద్ధాన్ని సాధ్యమైనంత మేరకు నివారించాలి. యుద్ధం చేయడమంటే పులిపై స్వారీ చేయడమే. ప్రారంభించే ముందే దాని పర్యవసానాల గురించి ఆలోచించాలి. అందువల్ల యుద్ధం ఎందుకు ప్రారంభించాల్సి వచ్చింది? యుద్ధాన్ని ఎందుకు ముగించాల్సి వచ్చింది అన్న ప్రశ్నలపై మాత్రం చర్చ జరగడం అవసరం. రష్యా%-%ఉక్రెయిన్‌ల మధ్య, ఇజ్రాయిల్%-%హమాస్‌ల మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయిన అంతర్జాతీయ శక్తులు భారత%-% పాకిస్థాన్‌ల విషయంలో మాత్రం ఎందుకు విజయవంతం కాగలిగాయి? ఒకటి రెండు ఫోన్‌కాల్స్‌తో ఇరు దేశాలు ఎందుకు శాంతించాయి? భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభించిన వెంటనే అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియాతో సహా అనేక దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించాయి. ఇరు దేశాలు తమ నిర్ణయాన్ని ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత పాక్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. తామే ఇరు దేశాలను ఒప్పించామని, ఈ దేశాలు తమ వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించాయని ఆయన అభినందించారు. తాను, అమెరికన్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారతదేశం, పాకిస్థాన్‌లోని సైనిక నాయకత్వంతో మాట్లాడామని, పరిస్థితి విషమించకుండా ఒప్పందం కుదిరేలా చేసామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. దాదాపు పది పన్నెండు దేశాలు ఇరు దేశాలను శాంతింపచేసేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రధానంగా భారత పాకిస్థాన్‌ల మధ్య తాత్కాలిక శాంతి ఏర్పర్చడంలో అమెరికా కీలక పాత్ర వహించినట్లు స్పష్టమవుతోంది. తమకు సంబంధం లేని యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని తొలుత ప్రకటించిన అమెరికా తన వైఖరి మార్చుకుని పెద్దన్న పాత్ర పోషించింది. యుద్ధం, సంఘర్షణలు జరిగినప్పుడే తమ పక్షాన ఎవరు నిలబడతారో అన్న విషయం స్పష్టమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహం కూడా ఏర్పర్చుకుని పరమ మిత్రుడుగా వ్యవహరించారు.

# మన భద్రతా వ్యూహంలో.. కొత్త అధ్యాయం



ఉగ్రవాదంపై తన విధానాన్ని మరోసారి చాటి చెప్పి భారత్, ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఆపరేషన్ కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాక, కోట్లాది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచింది. 'ఉగ్రవాదం, చర్చలు కలిసి ఉండలేవు. రక్తం, నీరు కలిసి పారవు, ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదు. ఇది భారత సైనిక పరా క్రమానికి ఒక కొత్త అధ్యాయం. ఉగ్రవాదంపై పోరాటంలో మైలురాయి చర్య' అని మోదీ స్పష్టంగా తెలిపారు. ఇది తాత్కాలిక చర్య కాదు.. దీని వెనుక ఉన్న విధాన మార్పే ప్రపంచం గమనించాల్సిన అంశం.

– పిల్లలకు హాలిడేస్‌లో హోంవర్క్ ఎందుకు?

ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడిలో అమాయక పౌరులు, తమ కుటుంబాల ఎదుటే హత్య చేయబడిన సంఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడిని కేవలం క్రూర నేరంగా కాకుండా, భారతీయ గౌరవం, సామరస్యం మీద జరిగిన కుట్రగా ప్రధాని మోడీ అభివర్ణించారు.

– 12 ఏళ్లకే డ్రగ్స్ అలవాటు.. ఆ పిల్లాడు ఏమయ్యాడు?

ఆపరేషన్ సిందూర్ గట్టి గుణపాఠం

ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా మే 6 – 7 తేదీలలో భారత సాయుధ దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిక్షణా శిబిరాలపై ఖచ్చితమైన క్షిపణి, డ్రోన్ దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో దశాబ్దాలుగా భారత్‌కు ముప్పుగా ఉన్న 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ చర్య ఉగ్రవాద నిర్మూలనలో కీలక మలుపుగా నిలిచింది. భారత దాడులు పాకిస్తాన్‌ను కుదిపేశాయి. పాకిస్తాన్ సైనిక స్థావరాలు, వాయుసేన స్థావరాలు, నౌకాదళ ప్రధాన కేంద్రంపై నేరుగా దాడి చేయడం వారి మౌలిక సదుపాయాలను మాత్రమే కాక, మనో ధైర్యాన్ని కూడా ఛిన్నాభిన్నం చేసింది. బహావల్‌పూర్, మురిద్కే వంటి ప్రదేశాలు, గతంలో 911, లండన్ ట్యూబ్ దాడులు, ముంబయి ఉగ్రదాడులతో అనుసంధానించబడిన కేంద్రాలుగా ఉండగా, ఇప్పుడు భారత్‌కి సునాయాస లక్ష్యాలుగా మారాయి.

లోకో పైలెట్ల పరిస్థితి దుర్భరం

'మేడ్ ఇన్ ఇండియా' డిఫెన్స్ సుపర్బ్!

ఈ ఆపరేషన్ విజయానికి 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాలు కీలకంగా నిలిచాయి. ఇది స్వదేశీ రక్షణ సామర్థ్యాలపై ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఆధునిక డ్రోన్లు, ఖచ్చితమైన క్షిపణులు... ఇవన్నీ భారత్ త్రివిధ దళాల పోరాట పటిమకి ఆధునిక సాంకేతిక వినియోగానికి పరిపక్వతకు సంకేతాలు.. మన భద్రతా సిద్ధాంతంలో మూడు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. అవి కఠినమైన ప్రతీకారం ఉగ్రవాదంపై భారతదేశం ఇక నిర్దయగా, నిర్దిష్టంగా ప్రతీకారం తీసుకుంటుంది. భారత్ అణు బెదిరింపులను లెక్కచేయదు.. దానికంటే ప్రాధాన్యం దేశ గౌరవం అని ఈ ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.

ప్రపంచ యుద్ధాల వెనుక.. పచ్చి నిజాలు

### స్కాల్ఫ్-ఇజి క్రూయిజ్ క్షిపణులు

భారత రాఫెల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన క్రూయిజ్ క్షిపణులు ఫ్రాన్స్, యూకే సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ ఖచ్చితత్వ దాడి ఆయుధం కొన్ని అత్యాధునిక లక్షణాలతో రూపొందించ బడింది. ఈ ఆయుధం రాడార్‌లకు చిక్కకుండా లక్ష్యాన్ని చేరు తుంది. భారీ కాంక్రీటు బంకర్లను ధ్వంసం చేయగల సత్తా కలిగి వుంది. శక్తివంతమైన వార్‌హెడ్ ఉండటంతో పాటు లక్ష్యాలను స్వయంగా గుర్తించగలదు. 250 కి.మీ పైగా ప్రయాణించగలదు, అంత దూరం ఉన్న లక్ష్యాలను ఇక్కడి నుండే దాడి చేయగలదు. ఈ క్షిపణులను ఉపయోగించి బహావల్పూర్, మురీద్కే వంటి ఉగ్ర స్థావరాలను అత్యంత ఖచ్చితంగా ధ్వంసం చేశాయి. అదే సమయంలో, భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు కూడా ఉపయోగించబడ్డాయి. ఇవి ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణులలో ఒకటి. వీటిని కీలకమైన పాకిస్తాన్ మౌలిక సదుపాయాలను వేగంగా ధ్వంసం చేయడానికి వినియోగించారు.

### గేమ్ చేంజర్ ఎస్- 400

ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఎస్–400 విస్తృతమైన రేంజ్‌ను కలిగి ఉంది. 600 కి.మీల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది గుర్తించగలదు. 400 కిలోమీటర్ల వరకూ మిసైళ్లను ప్రయో గించి శత్రు దేశాలకు చెందిన యుద్ధ విమానాలు సుఖోయ్–30), క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లు, ఇతర హానికర వాయుసేన వస్తువులను నాశనం చేయగలిగింది. దీని రియాక్షన్ టైమ్ కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల 5–10 సెకన్లలో కదులుతున్న టార్గెట్‌ను లాక్ చేసి నేల కూల్చగలిగింది. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఉన్న కీలకమైన సాంకేతిక అంశాలు ఏకకాలంలో 100 కంటే ఎక్కువ లక్ష్యాలను ట్రాక్ చేయగలదు. 4 రకాల మిసైళ్లతో విభిన్న రేంజ్‌లలో రక్షణ. లక్ష్యాన్ని 5%–%10 సెకన్లలో గుర్తించి తిప్పికొట్టే సామర్థ్యం. వాహనాలపై కదిలే విధంగా రూపొందించబడిన ఈ వ్యవస్థ ఎక్కడికైనా తేలికగా మోహరించగలదు.

### ఫలించిన పారికర్ దృఢ నిర్ణయం

2016లో రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తీసుకున్న దృఢమైన నిర్ణయం ఫలితంగా, %ూ%–400 కొనుగోలు చేయవద్దని అమెరికా, భారత్‌పై ఎంతో ఒత్తిడి తీసుకువచ్చింది. మన దేశంలోని నేతలు వ్యతిరేకించినప్పటికీ.. భారత్‌కి చైనా, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు కారణంగా వీటిని రష్యా నుంచి కొనుగోలు చేశారు. అదే ఇప్పుడు మనల్ని కాపాడింది. అదే కాకుండా ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్స్ టెక్నాలజీ ఆయన హయాంలోనే భారత్‌కు లభ్యమైంది. ఇప్పుడు ఆ విజ్ఞానం వాస్తవంగా ఫలాలు ఇస్తోంది. సాంకేతిక సమన్వయం, విజయం వెనుక ఉన్న శాస్త్రీయ శక్తి ఈ ఆపరేషన్ విజయవంతంగా సాగడానికి ప్రధాన కారణం.. భారత సైన్యం అత్యంత ఆధునిక వ్యవస్థలను ఖచ్చితంగా సమన్వయం చేయడమే. రియల్ టైం శాటిలైట్ ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జామింగ్ టెక్నా లజీలు ఆధారిత సమాచార బదిలీ మొత్తంగా, ఆపరేషన్ సిందూర్ ఒక సాంకేతిక విజ్ఞాన ఆధారిత దేశభక్తి.. శాస్త్ర, వ్యూహ, సామర్థ్యాల సమన్వయ రూపకల్పనగా నిలిచింది. ఇది భవిష్యత్తులో భారతదేశం సాధించబోయే వ్యూహాత్మక ఆధిక్యం వైపు తీసుకెళ్లే మరొక అడుగు.

# వెనక్కి తగ్గిన అమెరికా చైనా



వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హో లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది. గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా%–%చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి. చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి. వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి. ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది. ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు. అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, ముమ్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం. నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు. సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. ముమ్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

# పిల్లలకు హాలిడేస్‌లో హోంవర్క్ ఎందుకు?



ఎవరు ఎప్పుడు కనుక్కున్నారో, ఎట్లా మొదలు పెట్టినరో కానీ ఈ హాలిడే హోమ్ వర్క్ పిల్లల జీవితాల్లోకి ఒక భూతం లాగా వచ్చింది. హాలిడేస్‌కి అర్థమే మార్చేసిన ఈ సంస్కృతిని మొదలు పెట్టింది బడులే కానీ, తల్లిదండ్రులకు కూడా ఇదే కావాలి. టీచర్లను ఇంకా కొంచెం ఎక్కువ హోమ్ వర్క్ ఇవ్వమంటారు.. పిల్లలు మొదట కొన్ని రోజులు బానే ఉన్నా, రీఓపెనింగ్ దగ్గర పడే కొద్దీ, స్కూల్ మొదలవుతుందన్న దిగులుతో పాటూ ఈ హోమ్ వర్క్ చెయ్యాలన్న గుబులుతో సతమతమవుతుంటారు.

మన భద్రతా వ్యూహంలో.. కొత్త అధ్యాయం

ఆ పిల్లలు ఆడుకుంటున్నా, ఏం చేస్తున్నా మనసులో ఒక పక్క అవి బాధిస్తూనే వుంటాయి. ఇది పెద్దవాళ్లు అర్థం చేసుకోలేనంత రాకెట్ సైన్స్ ఏం కాదు. మరి పిల్లలంటే ఎందుకంత కసి. తల్లిదండ్రులు వాళ్లని హాయిగా ఏ దిగులు లేకుండా సెలవుల్లో సంతోషంగా ఎందుకుండనివ్వరు?

12 ఏళ్లకే డ్రగ్స్ అలవాటు.. ఆ పిల్లాడు ఏమయ్యాడు?

ఇదెక్కడి శాడిజం?

చిన్నపిల్లలు అన్ని రోజులు చదువుకు దూరంగా ఉంటే అన్నీ మర్చిపోతారని కొందరి వాదన. మర్చిపోయినదాని కంటే వేగంగా పిల్లలు నేర్చుకోగలుగుతారు అని కూడా తెలుసు కదా. సెలవులయిపోతూనే ఐఐటీ పరీక్ష ఏం రాయడం లేదు కదా. ఈ హాలిడే హోంవర్క్ సంస్కృతి లేని కాలంలో చదువుకున్న వాళ్ళేమన్నా ఇబ్బంది పడి ఒక్కో సంవత్సరం రెండు, మూడు సార్లు చదివినరా? ఎండాకాలం సెలవులు మాత్రమే కాదు, దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు, క్రిస్మస్ సెలవులు ఆఖరికి లాంగ్ వీకెండ్స్‌ని కూడా వదలరు. ఒక్క రెండు రోజులు సెలవు వస్తే, మరుసటి రోజు తప్పకుండా %జు% (క్లాస్ టెస్ట్) పెడతారు. ఇదెక్కడి శాడిజం? పరీక్ష ముందు సెలవులు కాబట్టి ఇంకొంచెం బాగా చదివి ఎక్కువ మార్కులు తెచ్చుకోవచ్చని పేరెంట్స్ కూడా దీన్ని సమర్థిస్తారు.. కానీ పిల్లలు సెలవుల్లో ఆనందాన్ని కోల్పోతున్నారని వాళ్లకు కొంచెం కూడా అనిపించదు. అట్లనే ఒక్కోసారి దసరా సెలవులు, సంక్రాంతి సెలవుల తర్వాత పరీక్షలు పెడతారు. కొంచెం ప్లాన్ చేసుకొని, సెలవుల ముందే పరీక్షలు పెడితే సిలబస్ తలకిందులై కొంపలు మునిగిపోతాయా?

లోకో పైలెట్ల పరిస్థితి దుర్భరం

సమ్మర్ క్యాంపులకు తరమడమేంటి?

బలంగా నాటుకుపోయిన ఇంకో సంస్కృతి.. సమ్మర్ క్యాంప్. పిల్లలు టైం వేస్ట్ చేయకుండా ఏదో ఒకటి నేర్చుకోవాలనీ, ఖాళీగా ఉంటే సోమరితనం అలవాటవుతుందనీ, దాని కోసమన్నా తొందరగా లేస్తారనీ ఇట్లా ఏవేవో కారణాలు.. పాపం పిల్లలు రోజూ పొద్దున్నే లేచి కనీసం ప్రశాంతంగా టాయిలెట్‌కి కూడా పోకుండా, ఉరుకులు పరుగులతో బాక్సులు పట్టుకుని బస్సులెక్కి బళ్లకు పోయి చిన్నప్పుడే గ్యాస్ట్రిక్ ప్రాబ్లెమ్స్, మల బద్ధకంతో బాధ పడుతుంటారు. కనీసం సెలవుల్లో నైనా హాయిగా ఉండనివ్వొచ్చు కదా. అప్పుడప్పుడు సోమరితనంగా ఉండటం ఫర్వాలేదు. సమ్మర్ క్యాంపుకు పోకపోయినా, పిల్లలు సెలవులలో ఇంట్లో ఏమేం నేర్చుకోవాలి, సెలవుల్ని ఎట్లా సద్వి నియోగం చేసుకోవాలి అని ప్రవచనాలు.. పిల్లలంటే ఎప్పుడు ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాల్నా? ఆటలాడుకోవడం, ఆనందంగా ఉండడం కన్నా సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఏముంటుంది.

## వేపులబైలు మాజీ సర్పంచ్
# పూల ఆదినారాయణ ఇకలేరు.



పీలేరు మే 14 : పీలేరుమండలంవేపుల బైలు బండమీదపల్లికి చెందినశ్రీ"శే పూల రంగయ్య (తాత)రైల్వే రామక్క దంపతుల రెండోకుమారుడు పూల ఆదినారాయణ వేపుల బైలు గ్రామసర్పంచ్ గా పనిచేశారు.గ్రామ అభివృద్ధికి ఎంతో దోహదపడిన వ్యక్తిగా గ్రామస్తులు పిలిస్తే పలికే వ్యక్తిగా మంచి పేరున్న పూల ఆదినారాయణ ఉద్యోగరీత్యా రైల్వేలో పనిచేస్తూ రాజకీయాలపై ఆసక్తితో ప్రజలకు సేవ చేయాలని ఆలోచనలతో వేపులబైలు గ్రామానికి సర్పంచ్ గా పోటీ చేసి గెలుపొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు భార్య, వేపులబైలు గ్రామంలో నివసిస్తూ ఇటీవల అనారోగ్యానికి గురై కొంతకాలంగా తిరుపతిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం రెండు గంటల సమయంలో తిరుపతి రుయా హాస్పిటల్ లో శివైక్యం చెందారు. ఆయన పార్టీవ దేహాన్ని స్వగ్రామమైన వేపులబైలు బండమీదపల్లికి తరలించి తదుపరి ఆయన అంతక్రియలు బుధవారం సాయంత్రం స్వగ్రామంలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఆయనకు బంధువులు స్నేహితులురాజకీయ నాయకులు వాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అయన ఆత్మ కు శాంతి చేకూరాలనిఆయనకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఎన్నికల హామీలు కూటమి
# ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.



గుత్తి :గుత్తి పట్టణం తాగునీటికి రూపాయి ఇవ్వలేదు హంద్రీనీవా కాల్వ వెడల్పు చేసి చెరువులకు నీళు ఇవ్వాలి. గుత్తి కోట అభివృద్ధికి నిధులు కేటాయించాలి. వైయస్సార్ సిపి ఐటివిభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి. గుత్తి మండలం అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తుంది అని రజాపురం వద్ద వైయస్సార్సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విమర్శించారు.ఈ సందర్భంగా ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని హితవు పలికారు.పట్టణంలో తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొంది అన్నారు.కొన్ని వార్డుల్లో నెలకోసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు.రోజు తాగునీరు ఇస్తాం అనిచెప్పి ఓట్లేపించుకొని ఎన్నికల్లో గెలవగానే హామీలు తుంగలోకి తొక్కారన్నారు. గుత్తికోట అభివృద్ధికి రూపాయి నిధులు విడుదల చెయ్యలేదు. బస్టాండ్ అభివృద్ధి చేసి బస్సులను పెంచి పూర్తిస్థాయి డిపోని ఏర్పాటుచేసి మేనేజర్ నీ నియమించాలి అన్నారు.ఆసుపత్రిలో సరైన డాక్టర్లు లేక చిన్న చిన్న రోగాలకు కూడా అనంతపురం కి పంపుతున్నారు.ఎప్పటినుండో అడుగుతున్న ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.నిత్యం రహదారుల్లో రైల్వే పట్టాలపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి వెంటనే సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు వెంటనే ఆసుపత్రిని అభివృద్ధి పరచమన్నారు.ప్రభుత్వ బాలుర జూనియర్ డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి విద్యను మెరుగుపరచాలని కోరారు.ఇక రైల్వే పరంగా చాలా రైళ్లు గుత్తి లో ఆగడం లేదు కొత్త రైళ్ల ఊసే లేదని విమర్శించారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని లేకుంటే ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు రామరంగా రెడ్డి గోపాల్ రెడ్డి కొండయ్య నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరుకె.వి.కె .స్టేడియంలో
# వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు.





ఆత్మకూరు : శ్రీశైలం శాసనసభ్యులుబుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆత్మకూర్ క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన ఆత్మకూర్ కె.వి.కె. స్టేడియం లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జరుగుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నుంచి వచ్చిన క్రీడా సామాగ్రిని ఆత్మకూర్ కె.వి.కె .స్టేడియం లో నిర్వహిస్తున్న 7 రకాల క్రీడలు (వాలీబాల్, ఖోఖో,కబడ్డి,బాల్ బ్యాట్మింటాన్,ఫుడ్ బాల్, తైక్వాండో,బాక్సింగ్) సంబందించిన క్రీడా సామాగ్రిని నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి.రాజకుమారి గనియ చేతుల మీదుగా అందుకున్న ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ఈ కార్యక్రమంలో వాలీబాల్ సెక్రటరీ నిమ్మి.కృష్ణ యాదవ్, జిల్లా క్రీడా అధికారి ఎం ఎన్ వి.రాజు మరియు స్టేడియం శిక్షకులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు కౌలు కార్డుల
# కొరకు దరఖాస్తు చేసుకోండి.



ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని కరివేన మరియు నల్ల కాలువ గ్రామాలలో కౌలు రైతుల అవగాహన సదస్సును బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలోని పొలము కౌలుకు వేసుకుంటున్న రైతులు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో భూ యజమానులకు మరియు కౌలు రైతులకు కౌలు కార్డుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. కౌలు కార్డులు పొందడం ద్వారా సబ్సిడీపై విత్తనాలు ,అన్నదాత సుఖీభవ ,పంట నమోదు, పంట బీమా, పంట నష్ట పరిహారం మరియు పంట రుణాలు మొదలైన పథకాలకు అర్హులు అవుతారని కావున గ్రామాలలోని కౌలు రైతులందరూ త్వరగా కౌలు పత్రాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు .ఈ సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారులు ,వ్యవసాయ విస్తరణ అధికారులు లతమ్మ ,రాజశేఖర్, రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### కనీస వేతనం 26వేల సాధనకై మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

### ఏఐటీయూసీ,సిఐటియు నేతల పిలుపు.



దేవనకొండ:- కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు ఎస్.ఎమ్. యూసుఫ్ భాష, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు లు పిలుపునిచ్చారు. బుధవారం మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల సమావేశం స్థానిక అయ్యప్ప దేవాలయ ఆవరణలో సిఐటియు మండల కార్యదర్శి ఎమ్. అశోక్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ...దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను నేడు లేబర్ కోడ్స్ గా మార్చి పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను దోచిపెడుతున్నారని లేబర్ కోడ్స్ రద్దుచేసి, కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 12వ పిఆర్సి అమలు చేయాలని ప్రధాన డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల నిర్వహిస్తున్నటువంటి మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేయాలని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక హక్కులను చట్టాలను తుంగలో తొక్కుతున్నాడని, దేశంలో కార్మికుల శ్రమతో సంపాదించిన దేశ ఆర్థిక సంపదను కార్పొరేట్లకు బానిసలుగా చేస్తున్నాడని ఆయన విమర్శించారు.. దేశానికి వెన్నెముకగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని తన రాజకీయ ఆర్థిక మిత్రులైన ఆదాని, అంబానీలకు కట్టబెడుతూ ప్రవేట్ పరం చేస్తున్నాడని ఇలాంటి వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని ఆయన అన్నారు .. దేశంలో కోట్లాది మంది అసంఘటితరంగ కార్మికులు, స్కీమ్ కార్మికులు కనీస వేతనాలకు దూరంగా కష్టపడి శ్రమ చేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల్లో సంక్షేమ పతకాలు ప్రజలకు అందించడంలో కీలక పోలిక పోషిస్తున్నారని అలాంటి వారికి వేతనాలు పెంచడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు.. తక్షణమే నెలకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. ఆశ, అంగన్వాడీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.ఆటో, హమాలీ, భవనిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు పాటుపడాలన్నారు.. దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20వ తారీకున జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాభాష రవికుమార్ రాజశేఖర్ శ్రీనివాసులు ఆటో మల్లికార్జున రామాంజనేయులు శేఖర్ వీరస్వామి నాగరాజు వీరాంజనేయులు వీరేంద్ర పెద్దరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనిక దళాలకు
# సంఘీభావంగా శ్రీసిటీలో రక్తదాన శిబిరం
## విశేష స్పందన




శ్రీసిటీ, : భారత సైనిక దళాలకు సంఘీభావంగా బుధవారం శ్రీసిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరంకు విశేష స్పందన వచ్చింది. శ్రీసిటీ ఫౌండేషన్, తిరుపతి ఎన్ టి ఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన శిబిరంను శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సాయంత్రం 3.30 సాగిన శిబిరంలో టి హెచ్ కె, యెక్సలెంట్ ఫార్మా, రాక్ వర్త్, ఈ-ప్యాక్, బ్రేక్స్ ఇండియా, బాంబే కోటింగ్, డైకి అల్యూమినియం, అల్సటాం, డైకిన్, కొబెల్కో, డానీలి, నోవా ఎయిర్, కింబర్లీ క్లార్క్, స్టేషన్ ఎస్ తో పాటు మరికొన్ని పరిశ్రమల ఉద్యోగులు, శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సహా 320 మంది రక్తదానం చేశారు. మన దేశ సమగ్రతను చాటి చెబుతూ, సైనిక దళాలకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ప్రాణాలను రక్షించే కీలక ప్రక్రియ అయిన రక్తదాన శిబిరంలో పాల్గొనేందుకు ముందుకొచ్చిన రక్త దాతలకు, వివిధ కంపెనీల యాజమాన్యాలకు కృత్ఞతలు తెలిపారు. అలాగే ఈ బృహత్తర కార్యక్రమంలో తమతో భాగస్వామ్యులైన ఎన్ టి ఆర్ ట్రస్ట్ కు అభినందనలు తెలిపారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఎన్ టి ఆర్ ట్రస్ట్ పీఆర్వో రవి తదితరులు పాల్గొని, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఈనెల 17నుండి విద్యార్థులకు
# పినాక ఉచిత శిక్షణ తరగతులు

### రాయలసీమ విద్యార్థి పోరాట సమితి.రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్.



కర్నూలు : పినాక ప్రజా సాధికార ట్రస్టు మరియు హైదరాబాద్ ఇన్కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ బి.యాదగిరి, అమిలియో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని శ్రీలక్ష్మీ హైస్కూల్ లో ఈ నెల 17నుండి మొదలయ్యే స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పినాక కోర్స్ డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ కోరారు. కర్నూలు నగరంలోని స్థానిక సీక్యాంపులో గల టీజీవి కళాక్షేత్రంలో పినాక ఉచిత శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమిలియో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా కర్నూలు నగరంలో పినాక ప్రజా సాధికార ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, గ్రూప్స్, సివిల్స్ గైడెన్స్ కోర్సును ఈ సంవత్సరం కర్నూలు నగరంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద ఎన్,ఆర్ పేటలో గల శ్రీలక్ష్మీ హైస్కూల్ లో నిర్వహిస్తున్నామని విద్యార్థులకు ఉచితంగా కోర్సుతో పాటు ఉచితంగా కోర్స్ మెటీరియల్, మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం, అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి ఏర్పాటు చేసామని అడ్మీషన్ల కోసం కోర్స్ డైరెక్టర్ రాయలసీమ రవికుమార్ సెల్:9177764147 ,9640969891 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ,మదాసి/మదారి కురువ సంఘాల నాయకులు కె.రామకృష్ణ,ఈశ్వరయ్య,కె.సి నాగన్న, డాక్టర్ మద్దిలేటి,పాల సుంకన్న,ఎల్లప్ప, మహేంద్ర,కురువలాలు,కల్లూరు శివ,కురువ రమణ,శివనారాయణ,పిట్టల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్
# ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు



కర్నూలు :కర్నూల్ జిల్లా ఇంచార్జి ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కర్నూల్ మూడవ పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ , ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ లో ఇద్దరు పట్టుబడ్డారు. కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కర్నూలు జెఎఫ్ సి ఎం కోర్టు వారు ఒక్కొక్కరి పై రూ. 10 వేల జరిమానా విధించారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించిన 6 మంది పై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. కర్నూలు జె ఎఫ్ సి ఎం కోర్టు వారు ఒక్కొక్కరిపై రూ. 1000 జరిమానా విధించారు.

## శ్లోకంతో ప్రదర్శించారు. ప్రతి జిల్లా తహసీల్ బ్లాక్‌లో
# సామూహిక యాజ్ఞోపవిట్ కర్మలు జరగాలీ



కాన్పూర్ : శ్రీ మాడ్ భగవత్ కథలోని వ్యాస్ పీత్ నుండి ఆచార్య పిటి సుభాష్ చంద్ర జీ మహారాజ్ యొక్క శ్రీముఖ్ నుండి భక్తులు కథను విన్నారు, నవాబాస్తా హౌసింగ్ వికాస్ హన్సూరం, కన్పూర్ వద్ద శ్రీ గ్యార్ముఖి హనుమాన్ ఆలయం 12 వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించబడింది. ఈ రోజు, భక్తులు శ్రీ కృష్ణుడి లీలా కథను విన్నారు. కథలో, కాన్సా స్లాటర్ కథ మరియు రుక్మానీ వివాహం కథ భక్తులు విన్నారు. ఉదయం, 7 మంది పిల్లలకు చెందిన సామూహిక యాజ్ఞోపవిట్ సంస్కర్ వేద శ్లోకంతో ప్రదర్శించారు. ప్రతి జిల్లా తహసీల్ బ్లాక్‌లో సామూహిక యాజ్ఞోపవిట్ కర్మలు జరగాలని ఆచార్య సుభాష్ చంద్ర జీ మహారాజ్ అన్నారు. కథ సమయంలో భక్తులు తీవ్రంగా శ్లోకాలను తిప్పారు. ఆచార్య అమిత్ మిశ్రా ఆచార్య అంకిత్ మిశ్రీ అరుణ్ దీక్షిత్ పిటి రాజ్ తివారీ పిటి మిరడుల్ తివారీ కథ సమయంలో ఆరాధించారు. .

## నూతన వధూవరులను
# ఆశీర్వదించిన వైకాపా నాయకులు

### ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మరియు వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి





ఆదోని: ఆదోని పట్టణం లోని వాసవి కల్యాణ మండపంలో ఆదోని మార్కెట్ యార్డ్ రామకృష్ణ కుమారుడు మంజునాథ్ మరియు ఆలూరు నియోజకవర్గంలోని హొలగుంద మండలానికి చెందిన చంద్రశేఖర్ కుమార్తె యశస్విని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మరియు వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి, నూతన దంపతులను ఆశీర్వదిస్తూ పిల్లాపాపలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆ దంపతులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో ఆదోని మరియు ఆలూరు వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో
# మరోఏడుగురు ముద్దాయిలు అరెస్ట్



ఆలూరు : చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో మరో ఏడుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఏఎస్పి హుస్సేన్ పీరా,పత్తికొండ డివిజన్ డిఎస్పి వెంకటరామయ్య తెలిపారు. ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి, చిప్పగిరి ఎస్సై ఏసి శ్రీనివాసులు, హొళగుంద ఎస్సై దిలీప్ కుమార్, ఆలూరు ఎస్సై మహబా ఖాషాలతో కలిసి గుంతకల్ బళ్లారి రహదారిపై ఉన్న విడపనకల్ మండలం పెంచలపాడు క్రాస్ వద్ద అరెస్టు వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. ఈ హత్య కేసులో పచ్చరపల్లి నారాయణ, పెద్దన్న, గౌసియా. రాజేష్ లు ముఖ్య పాత్ర పోషించి, వారు మరియు వారి అనుచరులతో చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేశారన్నారు. ఈ హత్య కేసులో ఇప్పటి వరకు మొత్తము 11 మంది ముద్దాయిలు నేరము చేసినట్టుగా నేరదర్యాప్తులో తేలినది. మేకల శ్రీనివాసులు, బోయ పెద్దన్న , బోయ రాము, వడ్డె నవీన్, ధనుంజయ, దొడ్ల మనోహర్భతగాదాల లో ఏడుగురు ముద్దాయిలను నేరంలో వారు ఏ విధంగా పాల్గొన్నారో పూర్తి ఆధారాలతో నేర దర్యాప్తు అధికారి జి హుస్సేన్ పీరా గారు అరెస్టు చేయడమైనది. ఈ అరెస్టులో పత్తికొండ డిఎస్పీ వెంకటరామయ్య గారు, ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి గారు, చిప్పగిరి ఎస్సై ఏపీ శ్రీనివాసులు గారు, హొలగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ గారు, అలూరు ఎస్సై మహబూబ్ భాషా పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటన కోసం

# త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి.

**మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.**



అనంతపురం,: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన కోసం త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గౌరవ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ గారు ఈనెల 15, 16, 17 వ తేదీలలో అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా గుత్తి మండలం బేతాపల్లిలో పర్యటిస్తుండగా, గ్రామం వద్ద హెలిప్యాడ్, సభా వేదిక మరియు రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ ను వెంటనే సిద్ధం చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని, మంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. సభ ప్రాంగణం వద్దగల హై టెన్షన్ టవర్ వద్ద బార్కెట్స్ ఏర్పాటు చేయాలని ఆర్.అండ్.బి అధికారులను, అటువైపు ఎవరిని వెళ్లకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనపై ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లపై తగు సూచనలు, సలహాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఓబులేసు, ఆర్.అండ్.బి అధికారులు, పోలీసు అధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నసనకోట దుర్గమాంబ జాతర

# మహోత్సవాలు వైభవంగా ప్రారంభం

**40లక్షలతో నిర్మించిన పలు కట్టడాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్**

**దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు**

**హరియానచెరువు నుంచి పాల కావడి ఊరేగింపు**

**నసనకోటలో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం**





రాప్తాడు : రామగిరి మండలం నసనకోటలో దుర్గమాంబ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం వద్ద 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రొటెక్షన్ వాల్ రైలింగ్ అదనపు సౌకర్యాలు నాగలకట్ట నిర్మాణాలను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. చాలా ఏళ్ల తర్వాత జాతర మహోత్సవం నిర్వహిస్తుండటంతో నసనకోటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఒక ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా సాగింది. హరియాన్ చెరువు గ్రామం నుంచి పాల కావిడి ఊరేగింపు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి





జలధివాసము కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల తర్వాత విగ్రహాన్ని పునఃప్రతిష్టించనున్నట్లు అర్చకులు తెలిపారు. అఖండ దీపారాధన, సభావందనము, గోపూజ, గంగపూజ, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనము, శ్రీ అభయాంజనేయ స్వామికి జలాధివాసము వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంకాల వేదపారాయణము, శ్రీ లలితా సహస్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మరియు శ్రీరామ్, సిద్దార్థ దంపతులతో పాటు పంచాయతీ పెద్దలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నసనకోట గ్రామంలో చాలా ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండటం చాలా సంతోషంగా ఉందని, ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొనాలని శ్రీరామ్, సునీత విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ వారు దగ్గరుండి పర్యవేక్షించారు..

# ఇండియాలో బాయ్‌కాట్ టర్కీ క్యాంపెయిన్..



భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య టర్కీ(తుర్కియో) పాక్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో ఆ దేశ నుంచి దిగుమతి అయ్యే వస్తువులను బహిష్కరించాలని చాలా మంది భారతీయులు స్వచ్ఛందంగానే ఒక క్యాంపెయిన్ మొదలుపెట్టారు. ప్రస్తుతం బాయ్‌కాట్ టర్కీ అనే స్లోగన్ సోషల్ మీడియాలో కూడా బలంగా వినిపిస్తుంది. భారతీయ పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్స్ కాకుండా ఇతర దేశాల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ స్పందించారు. ఇండియాలో బాయ్‌కాట్ టర్కీ క్యాంపెయిన్ రన్ అవుతున్నా.. వెనక్కి తగ్గదేది లేదంటూ మరోసారి పాకిస్థాన్ తమ మద్దతు కొనసాగుతుందంటూ ప్రకటించాడు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను ఎర్డోగన్ స్వాగతించినప్పటికీ అతను పాకిస్థాన్ టర్కీ మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నాడు. “పాకిస్తాన్ సోదర ప్రజలకు మా మద్దతును బహిరంగంగా ప్రకటిస్తూనే, చాలా ప్రమాదకరమైన స్థాయికి పెరిగిన ఉద్రిక్తతను తగ్గించడానికి మేం తీవ్ర ప్రయత్నాలు చేసాం” అని వెల్లడించాడు. రాబోయే కాలంలో ఎటువంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సలహా ఇస్తూ పాకిస్తాన్‌కు టర్కీ చేసిన “స్నేహపూర్వక హెచ్చరిక”ను కూడా ఆయన పునరుద్ఘాటించారు. ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో “నా ప్రియమైన సోదరుడు షెహబాజ్‌కు.. ప్రపంచంలోని చాలా తక్కువ దేశాలు మాత్రమే ఆస్వాదిస్తున్న తుర్కియే, పాకిస్తాన్ మధ్య సోదరభావం నిజమైన స్నేహానికి ఉత్తమ ఉదాహరణలలో ఒకటి. తుర్కియేగా, పాకిస్తాన్ శాంతి, ప్రశాంతత, స్థిరత్వానికి మేం చాలా ప్రాముఖ్యతనిస్తాం. వివాదాలను పరిష్కరించడంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యతనిచ్చే పాకిస్తాన్ వివేకవంతమైన, ఓపికగల విధానాన్ని మేం అభినందిస్తున్నాం. గతంలో, భవిష్యత్తులో మాదిరిగానే మంచి, చెడు సమయాల్లో మేం మీ పక్షాన ఉంటాం. సోదర పాకిస్తాన్‌ను నా అత్యంత హృదయపూర్వక ప్రేమతో అభినందిస్తున్నాను.” అని రాసుకొచ్చాడు. అంతకుముందు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ “నా ప్రియమైన సోదరుడు అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ పాకిస్తాన్‌కు ఇచ్చిన బలమైన మద్దతు, అచంచలమైన సంఘీభావం నన్ను తీవ్రంగా కదిలించింది. టర్కీతో దాని దీర్ఘకాల, కాలపరీక్షకు గురైన, శాశ్వతమైన సోదర సంబంధాలకు పాకిస్తాన్ గర్విస్తోంది.'' అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (%ూ×జ%)లో కీలక స్థానాన్ని పొందాలని కోరుకునే టర్కీ, భారతదేశానికి సంబంధించిన విషయాలలో పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చింది. ఇస్లామిక్ దేశాలలో తన స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని టర్కీ భావిస్తోంది. భారత్, పాక్ వివాదంలో టర్కీ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడంతో భారతదేశంలో ‘టర్కీని బహిష్కరించండి’ క్యాంపెయిన్ నడుస్తోంది. పాకిస్తాన్‌కు డ్రోన్‌లు సహా ఆయుధ వ్యవస్థలను అందించడంపై టర్కీ దేశంపై భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే చర్యలు

**సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలుపై పబ్లిక్ నోటీస్ ఇవ్వాలి**

**బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసే**

**వారితో జరిమానాలు వసూలు చేయాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**నగరంలోని హౌసింగ్ బోర్డ్ లో సెవెన్ హిల్స్ కాలనీ వద్ద**

**ఇంటింటి చెత్త సేకరణను ఆకస్మికంగా**

**తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**





అనంతపురం,: నగరంలో ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ లో సెవెన్ హిల్స్ కాలనీ వద్ద బుధవారం ఉదయమే ఇంటింటి చెత్త సేకరణను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వచ్చి ప్రతిరోజు చెత్తను సేకరిస్తున్నారా, పారిశుద్ధ్యం బాగా చేస్తున్నారా, తదితర వివరాలను ప్రజలతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలుపై ఈరోజు పబ్లిక్ నోటీస్ ఇవ్వాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే అలాంటి దుకాణదారులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి జరిమానాలు వసూలు చేయాలన్నారు. ప్రతి టీ షాపు, ఇతర దుకాణాల చుట్టూ చెత్తను వేయరాదని తెలియజేయాలని, ప్రతి దుకాణం వద్ద తడి చెత్త, పొడి చెత్తలకు సంబంధించి వేరువేరుగా డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని పబ్లిక్ నోటీసులు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రజలకు తెలియజేయడమేమనగా, మీ షాపు చుట్టూ చెత్త ఉంటుంది, ఇంటింటి నుంచి చెత్త సేకరణకు వచ్చినప్పుడు దానిని అందజేయాలని, మీరు చెత్తను అక్కడే వేస్తున్నారని, అలా చేయడం చట్టరీత్యా నేరమని, జరిమానాలు వసూలు చేస్తామని నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ బోర్డ్ లో సెవెన్ హిల్స్ కాలనీ వద్ద డ్రైనేజీ లేదని స్థానికుడు మహమ్మద్ ముస్తఫా తెలియజేయగా, ఈ విషయమై ఆ స్థలాన్ని తనిఖీ చేసి అక్కడ డ్రైన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నగర పాలక సంస్థ కమిషనర్ ని ఆదేశించారు.అనంతరం హౌసింగ్ బోర్డ్ లోని రామ్ నరేష్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. డ్రైనేజీలో చెత్తను, ప్లాస్టిక్ ను తొలగించాలని చెప్పినా ఎందుకు చేయలేదని, వెంటనే డ్రైనేజీ శుభ్రం చేసే పనులను చేపట్టాలని, పనులు పూర్తి అయ్యాక ఫోటోలు పంపించాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, డ్రైనేజీని వెంటనే శుభ్రం చేయాలన్నారు. నగరంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద శుభ్రం చేసి ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు, ఎస్ఈ చంద్రశేఖర్, ఎం.హెచ్.ఓ నరసింహులు, ఈఈ షకీర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సెక్రటరీ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# రూ. 22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్!

**దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు 16న**

**మంత్రి లోకేష్ శంకుస్థాపన**

**ప్రజాప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న**

**పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు**

అమరావతి,: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తెచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఎపికి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ.22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈనెల 16వతేదీన రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేష్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో లోకేష్ ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది.రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై మొత్తంగా 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ గా ఆవిర్భవించడమే గాక ఎపి క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఎపి పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న పిపిఎలన్నింటినీ జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దుచేసింది. వైసిపి ప్రభుత్వ అనాలోచిత చర్యలతో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జీరోస్థాయికి పడిపోయింది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గత ఏడాది అక్టోబర్ లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేష్ రెన్యూ పవర్ ఛైర్మన్ కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి నారా లోకేష్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.65వేలకోట్లతో 500 సిబిజి ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు రాగా, కనిగిరిలో తొలిప్లాంట్ కు మంత్రి లోకేష్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేలకోట్ల పెట్టుబడి), ఎన్ టి పిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ.50వేల కోట్లు), ఎస్ఎఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయేరోజుల్లో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.

# అనుకోని విపత్తు సంభవిస్తే.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**నగరంలోని రాజహంస అపార్ట్మెంట్ లో ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్..**



అనంతపురం, : అనుకోని విపత్తు సంభవిస్తే.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో ఉన్న రాజహంస అపార్ట్మెంట్ లో జిల్లా ఫైర్ శాఖ, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ సందర్భంగా పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని రాజహంస అపార్ట్మెంట్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు.



అపార్ట్మెంట్లో 77 కుటుంబాలు ఉంటే 400 నుంచి 500 దాకా జనాభా ఉంటుందని, ఇలాంటి స్థలాల్లో మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటాయని, అప్పుడు బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్ కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్ ని మొదట అధికారులు చూపించడం జరిగిందన్నారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు కూడా డ్రిల్ గురించి నేర్చుకున్నారన్నారు. తరువాత ఇక్కడున్న పౌరులచేత రెస్క్యూ చేయించడం జరిగిందని తెలిపారు. మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, యువకులకి ఎక్కువగా అవగాహన రావాలని క్విజ్ పోటీలను నిర్వహించామని, ఖచ్చితమైన సమాధానం ఇచ్చిన వారికి బహుమతులు కూడా ఇచ్చామన్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం యంత్రాంగం వచ్చినప్పుడు వారికి ఎలా సహకరించాలి అనేది తెలుసుకోవాలన్నారు.అంతకుముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే...విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే....యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే....అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి.. ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు...అన్న అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడినుంచి క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్నద్ధతను తెలియజేశారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, యువకులకి అవగాహన రావాలని క్విజ్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్డిఆర్ఎఫ్, జిల్లా ఫైర్ సిబ్బంది, వైద్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని విధాలా సిద్ధం కావాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**



అనంతపురం,: వచ్చే ఖరీఫ్ నేపథ్యంలో వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని విధాలా సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రైమరీ సెక్టర్ పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ - 2025లో 50,592 క్వింటాల విత్తన వేరుశనగను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విత్తన పంపిణీకి సంబంధించి రోజువారి యాక్టివిటీలను తయారు చేయాలని, ఏ రోజు ఎక్కడ నిల్వ పెట్టాలి, పంపిణీ ఎప్పుడు చేపట్టాలనేది ప్రణాళిక రూపొందించాలన్నారు. కిసాన్ డ్రోన్స్ సిహెచ్సికి సంబంధించి జిల్లాలోని 31 మండలాల్లో 26 గ్రూపులను గుర్తించడం జరిగిందని, ఆయా గ్రూపులకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. కిసాన్ డ్రోన్లకు సంబంధించి రైతుల గ్రూపులను ఎంపిక చేయాలని, జిల్లాలో 35 డ్రోన్లను కేటాయించగా 26 గ్రూపులను ఎంపిక చేయడం జరిగిందని, మిగిలిన గ్రూపులను ఎంపిక చేసి, ఈనెలాఖరు డ్రోన్ల పంపిణీ పూర్తి కావాలని, ఇందులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు%ఎ% నష్టపరిహారం త్వరగా అందించేలా చూడాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలవ ఇరువైపుల రైతులు ఉద్యాన పంటలు సాగుచేసేలా చూడాలని, ఇప్పటికి ఎంతమంది రైతులు ఉద్యాన పంటలను సాగు చేశారు అనే వివరాలను అందించాలని, కాలువ ఇరువైపులా మరింతమంది రైతులు ఉద్యాన పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ గట్లపై టేకు మొక్కల బౌండరీ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, ఏడి ఫిరోజ్ ఖాన్, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, డిసిఓ అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఎడిఎలు, ఏడి రాకేష్, ఏవో బాలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## మార్కెట్‌లో మరో నయా ఈవీ స్కూటర్ హల్‌చల్ రూ.42 వేలకే మీ సొంతం


ప్రపంచవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా ప్రజలు రోజువారీ పనులకు వెళ్లడానికి ఈవీ స్కూటర్లను వాడేందుకు ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ డిమాండ్‌ను ఉపయోగించుకునే విధంగా కొన్ని కంపెనీలు తక్కువ ధరకే అధునాతన ఈవీలను మార్కెట్‌లో లాంచ్ చేస్తున్నాయి. ఒడిస్సే కంపెనీ కూడా తాజాగా హైఫై పేరుతో మరో ఈవీ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. భారతదేశంలో ప్రముఖ ఈవీ స్కూటర్ తయారీదారు అయిన ఒడిస్సే మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ హైఫై పేరుతో కేవలం రూ.42 వేలకే ఓ కొత్త ఈవీ స్కూటర్‌ను లాంచ్ చేసింది. ముంబైకి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ అయిన ఒడెస్సే మే 10 నుంచి తమ డీలర్ల వద్ద ఈ స్కూటర్ కొనుగోలుకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. హైఫై స్కూటర్ లాంచ్‌పై ఒడిస్సే ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు నెమిన్ వోరా మాట్లాడుతూ తక్కువ వేగంతో వెళ్లే హైఫై స్కూటర్ పట్టణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని లాంచ్ చేశామని స్పష్టం చేశారు. ఒడిస్సే హైఫై స్కూటర్ రెండు బ్యాటరీ ఎంపికలతో లాంచ్ చేశారు. 48 వాట్స్, 60 వాట్స్ బ్యాటరీ ఎంపికలతో ఈ స్కూటర్ కొనుగోలు చేయవచ్చు. ఒడిస్సే హైఫై స్కూటర్ 250 వాట్స్ ఎలక్ట్రిక్ మోటారు ద్వారా శక్తిని పొందితుంది. ఈ స్కూటర్ కేవలం గంటకు 25 కిలో మీటర్ల గరిష్ట వేగంతో మాత్రమే వెళ్తుంది. ముఖ్యంగా పట్టణ ప్రయాణికులకు అనువుగా ఈ స్కూటర్ ఉంటుంది. ఈ స్కూటర్ అధునాతన లిథియం అయాన్, గ్రాఫేన్ బ్యాటరీ సాంకేతికతతో ఆకట్టుకుంటుంది. ఈ స్కూటర్‌ను ఓ సారి ఛార్జ్ చేస్తే 70 నుంచి 89 కిలోమీటర్ల మైలేజీను అందిస్తుంది. ఈ స్కూటర్‌ను ఫుల్ చార్జ్ చేయడానికి 4 నుంచి 8 గంటల సమయం పడుతుంది. ఈ స్కూటర్ తేలికైన, కాంపాక్ట్ నిర్మాణంతో రావడం వల్ల ట్రాఫిక్‌లో కూడా సులభంగా వెళ్లిపోవచ్చు. ఒడిస్సే ఈవీ స్కూటర్‌లో క్రూయిజ్ కంట్రోల్, ఎల్‌ఈడీ డిజిటల్ మీటర్, రోజువారీ అవసరాలను అనుగుణంగా విశాలమైన బూట్ స్పేస్ ఆకట్టుకుంటాయి. ఈ స్కూటర్ ఐదు విభిన్న కలర్ వేరియంట్లలో లభిస్తుంది. రాయల్ మాట్టే బ్లూ, సిరామిక్ సిల్వర్, అరోరా మాట్టే బ్లాక్, ఫ్లేర్ రెడ్, జాడే గ్రీన్ రంగుల్లో ఈ స్కూటర్‌ను కొనుగోలు చేయవచ్చు. ఈ స్కూటర్ వీల్‌బేస్ 1325 మిమీ, గ్రౌండ్ క్లియరెన్స్ 215 మిమీగా ఉంది. ఈ స్కూటర్ బరువు కేవలం 88 కిలోలు (కర్బ్) మాత్రమే. సస్పెన్షన్ విధుల కోసం టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు, వెనుక మోనో-షాక్ అబ్జార్బర్‌తో ఆకట్టుకుంటుంది

## ఆ పోస్టును అస్సలు నమ్మవద్దు తేల్చి చెప్పిన అధికారులు



టెక్నాలజీ పెరిగే కొద్దీ ప్రజలు తమ పనులను చాలా సులువుగా చేసుకోగలుగుతున్నారు. గతంలో రోజంతా కష్టబడి చేసే పనులు.. నేడు నిమిషాల మీద జరిగిపోతున్నాయి. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్లు విపరీతంగా పెరిగిపోయారు. వివిధ రకాల మోసాలతో బ్యాంకు ఖాతాల్లో డబ్బులను కాజేస్తున్నారు. ముఖ్యంగా ఏటీఎంల దగ్గర అనేక రకాల మోసాలు జరుగుతున్నాయి. వాటితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. ఏటీఎంలో బ్యాంకు డెబిట్ కార్డును పెట్టే ముందు రద్దు చేయి బటన్ ను రెండు సార్లు నొక్కితే మోసాల బారిన పడకుండా ఉండొచ్చని దాని సారాంశం. అది నిజమేనా.. దాని వెనుక ఉన్న అసలు సంగతి ఏమిటో తెలుసుకుందాం. ఏటీటఎంలో లావాదేవీలు నిర్వహించే ముందు మెషీన్ లోని రద్దు చేయి అనే బటన్ రెండు సార్లు నొక్కితే మంచిదని ఇటీవల సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. అది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో చాలామంది వినియోగదారులు దాన్ని నిజమనుకుంటున్నారు. ఏటీఎం వద్దకు వెళ్లినప్పుడు అలాగే చేస్తున్నారు. అసలు ఇది నిజమేనా అనే సందేహాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టు నేపథ్యంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూర్ (పీఐబీ) రంగంలోకి దిగింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టును పరిశీలించింది. అనంతరం అది నకిలీ పోస్టుగా తేల్చింది. ఏటీఎం మెషీన్ లో అలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆ పోస్టు చేయలేదని కూడా తేల్చి చెప్పింది. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏటీటఎం వద్ద అపరిచితులను నమ్మవద్దని హెచ్చరించింది. టెక్నాలజీపై అవగాహన పెంచుకుని, దానికి అనుగుణంగా లావాదేవీలు నిర్వహిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపింది. ఆధునిక కాలంలో పెరిగిన సాంకేతికతతో బ్యాంకు లావాదేవీలు చాలా సులువుగా జరుగుతున్నాయి. గతంలో డబ్బులను తీసుకోవాలంటే ఉదయాన్నే బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ లైన్ లో నిలబడి మన వంతు వచ్చాక డబ్బులను తీసుకునేవాళ్లం. ఈ పని చేయడానికి దాదాపు ఒక పూట సమయం పట్టేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రతి ఊరిలోనూ ఏటీటఎం లు వచ్చేశాయి. ఏ సమయంలోనైనా అక్కడకు వెళ్లి చాలా సులువుగా డబ్బులు తీసుకోవచ్చు. అయితే ఏటీఎం వద్ద అనేక మోసాలు జరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తల పేరుతో నకిలీ పోస్టులు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాటితో కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

## ప్రయాణికులకు అలర్ట్ దేశవ్యాప్తంగా పలు ఎయిర్ పోర్టులు మూసివేత విమానాలు రద్దు




ఆపరేషన్ సిందూర్ కింద భారతదేశం పాకిస్తాన్‌లోని జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుంది. ఆపరేషన్ సింధూర్‌తో అప్రమత్తమైన పాక్ సరిహద్దుల్లో కాల్పులకు పాల్పడింది. దీంతో అప్రమత్తమైన భారత ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. కేవలం శ్రీనగర్ మాత్రమే కాదు..పహల్‌గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడింది. పాకిస్థాన్‌లోని తొమ్మిది స్థావరాలపై మెరుపు దాడులు చేసింది భారత సైన్యం. అయితే అంతర్జాతీయ సరిహద్దుకు దగ్గర్లోని ఉగ్రవాదుల స్థావరాలను మాత్రమే భారత్ టార్గెట్ చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కి.మీ దూరంలోని బహవల్‌పూర్‌లో ఉన్న జైష్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం మురిడ్కే, సాంబా ఎదురుగా సరిహద్దుకు 30 కి.మీ దూరంలో ఉన్న లష్కరే క్యాంప్‌పై దాడి చేసింది. అయితే ఆపరేషన్ సిందూర్‌లో 80 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఇండియాలో బాయ్‌కాట్ టర్కీ క్యాంపెయిన్..

భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య టర్కీ(తుర్కియో) పాక్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో ఆ దేశ నుంచి దిగుమతి అయ్యే వస్తువులను బహిష్కరించాలని చాలా మంది భారతీయులు స్వచ్ఛందంగానే ఒక క్యాంపెయిన్ మొదలుపెట్టారు. ప్రస్తుతం బాయ్‌కాట్ టర్కీ అనే స్లోగన్ సోషల్ మీడియాలో కూడా బలంగా వినిపిస్తుంది. భారతీయ పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్స్ కాకుండా ఇతర దేశాల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ స్పందించారు. ఇండియాలో బాయ్‌కాట్ టర్కీ క్యాంపెయిన్ రన్ అవుతున్నా.. వెనక్కి తగ్గేదే లేదంటూ మరోసారి పాకిస్థాన్ తమ మద్దతు కొనసాగుతుందంటూ ప్రకటించాడు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను ఎర్డోగన్ స్వాగతించినప్పటికీ అతను పాకిస్థాన్ టర్కీ మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నాడు. "పాకిస్తాన్ సోదర ప్రజలకు మా మద్దతును బహిరంగంగా ప్రకటిస్తూనే, చాలా ప్రమాదకరమైన స్థాయికి పెరిగిన ఉద్రిక్తతను తగ్గించడానికి మేం తీవ్ర ప్రయత్నాలు చేసాం" అని వెల్లడించాడు. రాబోయే కాలంలో ఎటువంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సలహా ఇస్తూ పాకిస్తాన్‌కు టర్కీ చేసిన "స్నేహపూర్వక హెచ్చరిక"ను కూడా ఆయన పునరుద్ఘాటించారు. ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో "నా ప్రియమైన సోదరుడు షెహబాజ్‌కు.. ప్రపంచంలోని చాలా తక్కువ దేశాలు మాత్రమే ఆస్వాదిస్తున్న తుర్కియే, పాకిస్తాన్ మధ్య సోదరభావం నిజమైన స్నేహానికి ఉత్తమ ఉదాహరణలలో ఒకటి. తుర్కియేగా, పాకిస్తాన్ శాంతి, ప్రశాంతత, స్థిరత్వానికి మేం చాలా ప్రాముఖ్యతనిస్తాం. వివాదాలను పరిష్కరించడంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యతనిచ్చే పాకిస్తాన్ వివేకవంతమైన, ఓపికగల విధానాన్ని మేం అభినందిస్తున్నాం. గతంలో, భవిష్యత్తులో మాదిరిగానే మంచి, చెడు సమయాల్లో మేం మీ పక్షాన ఉంటాం. సోదర పాకిస్తాన్‌ను నా అత్యంత హృదయపూర్వక ప్రేమతో అభినందిస్తున్నాను." అని రాసుకొచ్చాడు. అంతకుముందు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ "నా ప్రియమైన సోదరుడు అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ పాకిస్తాన్‌కు ఇచ్చిన బలమైన మద్దతు, అచంచలమైన సంఘీభావం నన్ను తీవ్రంగా కదిలించింది. టర్కీతో దాని దీర్ఘకాల, కాలపరీక్షకు గురైన, శాశ్వతమైన సోదర సంబంధాలకు పాకిస్తాన్ గర్విస్తోంది." అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (%ూ×జ%)లో కీలక స్థానాన్ని పొందాలని కోరుకునే టర్కీ, భారతదేశానికి సంబంధించిన విషయాలలో పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చింది. ఇస్లామిక్ దేశాలలో తన స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని టర్కీ భావిస్తోంది. భారత్, పాక్ వివాదంలో టర్కీ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడంతో భారతదేశంలో 'టర్కీని బహిష్కరించండి' క్యాంపెయిన్ నడుస్తోంది. పాకిస్తాన్‌కు డ్రోన్‌లు సహా ఆయుధ వ్యవస్థలను అందించడంపై టర్కీ దేశంపై భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

## పసిడి ప్రియులకు షాక్ మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు లేటెస్ట్‌గా తులం ఎంత ఉందంటే



బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి.. బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ హైకి ఎగబాకి.. లక్ష మార్కు దాటిన విషయం తెలిసిందే.. ఆ తర్వాత పసిడి ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చినట్లే వచ్చి.. మళ్లీ ఎగబాకుతున్నాయి.. వాస్తవానికి అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ఒక్కోసారి ధరలు తగ్గితే.. మరికొన్నిసార్లు పెరుగుతుంటాయి. ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో స్వచ్ఛమైన పసిడి ధర 99వేలకు పైగా ఉంది. మే 08 2025 గురువారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. ధరలు స్వల్పంగా పెరిగాయి.. దేశీయంగా 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.90,760 గా ఉండగా.. 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.99,010 గా ఉంది. వెండి కిలో ధర రూ.99,100లుగా ఉంది. పదిగ్రాముల బంగారంపై రూ.100, కిలో వెండిపై రూ.100 మేర ధర పెరిగింది. కాగా.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..**

**బంగారం ధరలు..**

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది.

విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది.

ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.90,910, 24 క్యారెట్ల ధర రూ.99,160 గా ఉంది.

ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.98,010 గా ఉంది.

చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల రేటు రూ.99,010 గా ఉంది.

బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది.

**వెండి ధరలు..**

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,11,100
విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,11,100
ఢిల్లీలో వెండి కిలో ధర రూ.99,100
ముంబైలో రూ.99,100
బెంగళూరులో రూ.99,100
చెన్నైలో రూ.1,11,100 లుగా ఉంది.

కాగా, ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవిగా గమనించగలరు. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలియాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

## రైతులకు కేంద్రం శుభవార్త వచ్చే నెలలోనే పీఎం కిసాన్ సొమ్ము జమ



భారతదేశంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ స్కీమ్‌ను అమలు చేస్తుంది. ఈ స్కీమ్ ద్వారా కేంద్రం నేరుగా రైతుల ఖాతాల్లో మూడు విడతలుగా కింద రూ.6 వేలను జమ చేస్తుంది. ఈ నేపథ్యంలో పీఎం కిసాన్ 20 వాయిదాపై కేంద్రం రైతులకు శుభవార్త చెప్పింది. వచ్చే నెలలో పీఎం కిసాన్ 20 విడతను జమ చేస్తామని స్పష్టం చేసింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు మద్దతు ఇస్తుంది. అలాంటి పథకం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి. దీని కింద కేంద్రం మూడు విడతలుగా డీబీటీ ద్వారా అర్హత కలిగిన రైతులకు సంవత్సరానికి రూ. 6,000 అందిస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వం నాలుగు నెల విరామంతో 19 వాయిదాలను విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో 19వ విడతను విడుదల చేశారు. దీంతో 2.4 కోట్ల మంది మహిళా రైతులు సహా 9.8 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. 18వ విడత అక్టోబర్ 2024లో విడుదలైంది మరియు 17వ విడత జూన్ 2024లో చెల్లించారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద అర్హత కలిగిన రైతులకు ప్రతి నాలుగు నెలలకు రూ. 2,000 చొప్పున సంవత్సరానికి రూ. 6,000 చొప్పున అందిస్తారు. ఈ డబ్బును ప్రతి సంవత్సరం మూడు విడతలుగా అందిస్తారు. ఏప్రిల్-జూలై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి నెలల్లో ఈ నిధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తారు. ఈ పథకాన్ని 2019 తాత్కాలిక బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. పీఎం కిసాన్ చివరి 19వ విడత ఫిబ్రవరిలో విడుదల చేసినందున తదుపరి విడత (20వ విడత) పీఎం కిసాన్ పథకం జూన్ 2025లో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రధానమంత్రి మోదీ దీనిని విడుదల చేస్తారు. అయితే కచ్చితమైన తేదీ, స్థలం ఇంకా ప్రకటించలేదు. కాబట్టి రైతులు అర్హతను తనిఖీ చేయడం, కేవైసీ పూర్తి చేయడం, లబ్ధిదారుల స్థితిని తనిఖీ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**మొబైల్ ఛార్జింగ్‌కి ఎంత విద్యుత్ ఖర్చు అవుతుందో మీకు తెలుసా..?**

పీఎం కిసాన్ స్టేటస్ తనిఖీ ఇలా

పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి

ఆ పేజీ కుడి వైపున ఉన్న 'మీ స్థితిని తెలుసుకోండి' ట్యాబ్‌పై క్లిక్ చేయ్యాలి.

ఫ్టీన్ నంబర్‌ను నమోదు చేసి, కాప్చా కోడ్‌ను పూరించి, 'డేటా పొందండి' ఎంపికను ఎంచుకోవాలి.

మీ బెనిఫీషరీ స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

## ఊపిరితిత్తుల వ్యాధులకు పతంజలి పరిష్కారం ఈ ఔషధం సర్వరోగ నివారిణి




పతంజలి శాస్త్రవేత్తలు చేసిన తాజా పరిశోధనలో, మైక్రోప్లాస్టిక్స్ వల్ల కలిగే ఊపిరితిత్తుల సమస్యలకు ఆయుర్వేద ఔషధం బ్రోంకోడిల్ ప్రభావవంతంగా ఉందని తేలింది. ఎలుకలపై నిర్వహించిన ఈ అధ్యయనం, బ్రోంకోడిల్ సైటోకిన్ విడుదలను తగ్గించి, ఊపిరితిత్తుల వాపును నివారిస్తుందని నిరూపించింది. ఈ పరిశోధన బయోమెడిసిన్ అండ్ ఫార్మకోథెరపీ జర్నల్ లో ప్రచురితమైంది. నేడు ప్రపంచం మొత్తం ప్లాస్టిక్ వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. మైక్రోప్లాస్టిక్స్ అని పిలువబడే ఈ చిన్న ప్లాస్టిక్ కణాలు ఇప్పుడు గాలి, నీరు, ఆహారంలో కనిపిస్తాయి. మనం వీటిని ప్రతిరోజూ తెలియకుండానే తింటున్నాము. ఈ కణాలు మానవ శరీరంలోకి, ముఖ్యంగా ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు, ఈ కణాలు వాపు, చికాకు, కణ సంబంధమైన నష్టం వంటి సమస్యలను కలిగిస్తాయి. ఇది ఊపిరితిత్తుల వాపు, ఎయిర్‌వే హైపర్-రెస్పాన్సివ్‌నెస్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది.

**పతంజలి పరిశోధన చేసింది**

పతంజలి శాస్త్రవేత్తలు ఎలుకలపై నిర్వహించిన తాజా పరిశోధనలో మైక్రోప్లాస్టిక్‌ల వల్ల కలిగే ఊపిరితిత్తుల పనితీరు క్షీణతను ఆయుర్వేద ఔషధం బ్రోంకోడిల్ ద్వారా చాలా వరకు నివారించవచ్చని నిర్ధారించారు. ఈ సంచలనాత్మక అధ్యయనం బ్రోంకో చికిత్స సైటోకిన్ విడుదల. ఎయిర్‌వే హైపర్-రెస్పాన్సివ్‌నెస్ వంటి మైక్రోప్లాస్టిక్-ప్రేరిత ఊపిరితిత్తుల వాపు గుర్తులను తగ్గించిందని నిర్ధారించింది. ఈ పరిశోధన ప్రపంచ ప్రఖ్యాత ఎల్సెవియర్ పబ్లికేషన్ ప్రచురించిన అంతర్జాతీయ పరిశోధన జర్నల్ బయోమెడిసిన్ అండ్ ఫార్మకోథెరపీలో ప్రచురించబడింది. ఈ సందర్భంగా ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ.. ఆయుర్వేదాన్ని శాస్త్రీయంగా నిరూపించడం, ప్రపంచంలోని ప్రస్తుత ఆరోగ్య సంబంధిత సమస్యలకు పరిష్కారాలను అందించడం పతంజలి లక్ష్యమని అన్నారు. పర్యావరణ కారకాల వల్ల కలిగే వ్యాధులకు శాశ్వత జ్ఞానం, లక్ష్య పరిశోధన, ఆధార ఆధారిత వైద్యం ద్వారా పరిష్కారాలను కనుగొనడం సాధ్యమని ఈ పరిశోధన రుజువు చేస్తుంది. ఈ సందర్భంగా పతంజలి పరిశోధనా సంస్థ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ అనురాగ్ వర్ష్నే మాట్లాడుతూ, శాశ్వత జ్ఞానం, ఆధునిక శాస్త్రాల ఈ అద్భుతమైన సంగమం మొత్తం ప్రపంచాన్ని ఆరోగ్యవంతంగా మార్చే అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని అన్నారు. ఆయుర్వేదానికి సంబంధించిన ఈ పురాతన జ్ఞానాన్ని శాస్త్రీయ ఆధారాలతో అందించడమే మా ప్రయత్నం

## ధోనీలా ఆలోచిస్తే విజయం మీదే పెట్టుబడి సమయంలో వీటిని మరువొద్దు



మహేంద్ర సింగ్ ధోనీ.. ఈ పేరు తెలియని వారు మన దేశంలో ఎవ్వరూ ఉండదు. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ను అభిమానించే వారందరికీ కూడా ధోనీ పేరు సుపరిచితమే. ఇండియన్ క్రికెట్ లో ఆయనకు ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. లెజెండరీ క్రికెటర్లు కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ తర్వాత ఆటను శాసించిన నాయకుడు ధోనీ. ఆటలో సమయానికి అనుగుణంగా ఎత్తులు వేయడం, ప్రత్యర్థి బ్యాటర్లను తడబడేలా చేసి అవుట్ చేయడం, వికెట్లు వెనకాల మెరుపు వేగంతో స్టంపింగ్ చేయడం ధోనీకే సాధ్యం. క్రికెట్ తో పాటు వ్యాపార రంగంలోనూ ధోనీ విజయకేతనం ఎగురవేశాడు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పెట్టుబడుల గురించి ఆయన ఎన్నో విలువైన విషయాలు వెల్లడించారు. మహేంద్ర సింగ్ ధోనీ చెప్పిన విషయాల్లోకి వెళితే.. పెట్టుబడి దారులు లాభం కోసం తొందరపడకూడదు. స్థిరమైన పెట్టుబడి మార్గాలను ఎంచుకోవాలి. తక్కువ రిస్కు ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటే కాలక్రమీణా మంచి రాబడిని ఇచ్చే అవకాశం ఉంటుంది. త్వరిత లాభాల కోసం ప్రమాదకరమైన వాటిలో డబ్బులను జమ చేయవద్దు. ముఖ్యంగా మార్కెట్ పరిస్థితులను బట్టి అవసరమైన మార్పులు చేసుకుంటూ వెళ్లాలి. త్వరగా అధిక లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని ధోనీ చెప్పాడు. ఆయన ఉద్దేశంలో సరైన మార్గాల్లో పెట్టుబడి పెడితే మీ డబ్బు ఎక్కడికీ పోదు. పైగా మీకు మంచి ఫలితాలను అందిస్తుంది. మీ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు ఎంపిక చేసుకోవడం, వాటిని నిర్వహించడం చాలా ముఖ్యం. ప్రతి దానికి అనుకూల, ప్రతికూల పరిస్థితులు ఉంటాయి. ఎక్కువ రాబడిని, బహుమతులను కోరుకుంటే ప్రమాదం కూడా ఎక్కువగానే ఉంటుంది. క్రికెట్ తో పాటు వ్యాపారంలోనూ మహేంద్ర సింగ్ ధోనీ తనదైన ముద్ర వేశాడు. వ్యాపారంలో వివిధ రంగాలకు తన పెట్టుబడులను విస్తరించాడు. టెక్నాలజీ, మొబిలిటీ, ఫిన్ టెక్, వెల్నెస్, సస్టైనబిలిటీ వంటి రంగాల్లో ఇన్వెస్ట్ చేశాడు. అలాగే వివిధ స్టార్టప్ లకు కూడా మద్దతుగా నిలిచాడు. గరుడ ఏరోస్పేస్, ఈమోటోరాడ్, టాగ్జా రహూ, ఖటాబుక్ వంటి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాడు

## మళ్లీ సీన్ రివర్స్ బంగారం ధరల్లో ఊహించని మార్పు తులం ఎంతంటే



బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి ఇది లాభదాయకం అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. కానీ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్, వచ్చే పండుగల నేపథ్యంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి మాత్రం ఇది ఒక రకంగా చెప్పాలంటే షాకింగ్ న్యూస్ అని చెప్పవచ్చు అంటున్నారు. మరోవైపు భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం ప్రారంభం అయింది. మే 7వ తేదీ బుధవారం బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.9,847లకు చేరుకుంది. అదే క్రమంలోనే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ. రూ.9,026లు పలుకుతోంది. ఇక,18 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రు.7,385లకు అమ్ముడవుతోంది.

**పలు నగరాల్లో బంగారం ధరలు..**

చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.90,260 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,470 వద్ద కొనసాగుతుంది.

మజ్జిగలో ఇది ఒక్కస్పూన్ కలుపుకొని తాగితే చాలు..బొడ్డు చుట్టూ

అలాగే ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.90,260 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.98,470 వద్దకు చేరింది.

ఇక ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.90,410కు చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.98,620 వద్ద కొనసాగుతుంది.


కోల్ కత్తాలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.90,260 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.98,470కు చేరింది.

బెంగుళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.90,260 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,470 వద్ద కొనసాగుతుంది.

**వెండి ధరలు పరిశీలించినట్టయితే**

ఇకపోతే, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. దేశీయ మార్కెట్లో వెండి ధర గ్రాముకు రూ.107.80 లు కాగా, కిలో వెండి ధర రూ.1,07,800.

## ప్లేట్‌లో రోటీ లేదు అణు బాంబు వేస్తామని బెదిరిస్తున్నారు పాక్‌లో కిలో పిండి ధర ఎంత



పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. పాకిస్తాన్‌పై చర్య తీసుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాలకు స్వేచ్ఛా హస్తం ఇచ్చారు. ఆ తర్వాత భారత సైన్యం యుద్ధానికి సన్నాహాలు ప్రారంభించింది. ఈ సన్నాహాలలో భాగంగా, యుద్ధం జరిగితే తమను తాము రక్షించుకోవడానికి, మే 7వ తేదీన దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతీకార చర్యకు భారత సైన్యం సిద్ధమవుతున్న తీరు చూసి, పాకిస్తాన్ నాయకులు, సైన్యం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అక్కడి స్థానిక ప్రజలకు వారి ప్రభుత్వంపై నమ్మకమే పోయింది. అయినప్పటికీ పాకిస్తాన్ నుండి పదే పదే అణు దాడి బెదిరింపులు వస్తున్నాయి. ఈ బెదిరింపు వెనుక చాలా కారణాలు ఉన్నాయి, ప్రధాన కారణాలలో ఒకటి పాకిస్తాన్‌కు వెళ్లే సింధు నది నీటిని భారత్ నిలిపివేసింది. రెండవ కారణం పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి యుద్ధం చేయడానికి సరిపోకపోవడం. పాకిస్తాన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. అక్కడ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతోంది. భారతదేశంలో గోధుమ పిండి ధర సాధారణంగా రూ.40 నుండి ప్రారంభమై రూ.60-65 వరకు ఉంటుంది. దీనికి విరుద్ధంగా, పాకిస్తాన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గోధుమ పిండి ధర ఆకాశాన్నంటుతోంది. పాకిస్తాన్ ఆన్‌లైన్ డెలివరీ కిరాణా యాప్‌లో శోధించినప్పుడు, భారతదేశానికి ఆనుకుని ఉన్న పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో 5 కిలోల పిండి ధర రూ. 615. అంటే కిలో గోధుమ పిండి ధర అక్షరాల రూ.123. పహల్గామ్ దాడి తర్వాత, 1960లో సంతకం చేసిన సింధు జల ఒప్పందాన్ని భారతదేశం రద్దు చేసింది. దీని కారణంగా పాకిస్తాన్‌కు వెళ్లే నీటిని భారతదేశం నిలిపివేసింది. పాకిస్తాన్ వ్యవసాయంలో 80 శాతం సింధు నది నీటితోనే సాగు చేయడం జరుగుతుంది. అటువంటి పరిస్థితిలో, ఈ నీరు ఎక్కువ కాలం నిలిచి ఉంటే, పాకిస్తాన్‌లో కరువు పరిస్థితి తలెత్తవచ్చు. పాకిస్తాన్‌లో ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు

## హార్దిక్ పాండ్యా ఆ తప్పే

# ముంబై కొంపముంచిందా..




ముంబై ఇండియన్స్ విజయాల పరంపరకు గుజరాత్ టైటాన్స్ ఎట్టకేలకు బ్రేక్ వేసింది. వరుసగా 6 మ్యాచ్‌లు గెలిచిన తర్వాత, ముంబై ఇండియన్స్ వాంఖడేలో గుజరాత్ టైటాన్స్‌ను సవాలు చేసింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో ఓటమిని ఎదుర్కొంది. మంగళవారం జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో భాగంగా 56వ మ్యాచ్‌లో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్‌ను 20 ఓవర్లలో కేవలం 155 పరుగులకే పరిమితం చేశాడు. వర్ష ప్రభావితంతో చివరి వరకు హెచ్చు తగ్గులు ఉన్నాయి. అయితే, చివరికి వర్షం కారణంగా ఓవర్లు కుదించారు. గుజరాత్ గెలవడానికి చివరి ఓవర్లో 15 పరుగులు అవసరం. చివరకు ఈ టార్గెట్ ఛేదించి గుజరాత్ విజయం సాధించింది.

### గిల్-బట్లర్ ఇన్నింగ్స్ కీలకం..

వాంఖడేలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ టైటాన్స్ ) కు మంచి ఆరంభం అవసరం. కానీ, ట్రెంట్ బౌల్ట్ తన మొదటి ఓవర్ రెండో బంతికే 5 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్ సాయి సుదర్శన్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత, కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జోస్ బట్లర్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. మొదటి వికెట్ 6 పరుగుల వద్ద పడిపోయిన తర్వాత, కెప్టెన్ గిల్, బట్లర్ ప్రారంభంలో తెలివిగా బ్యాటింగ్ చేయడం కనిపించింది. అయితే, గిల్-బట్లర్ జంట రెండో వికెట్‌కు 63 బంతుల్లో 72 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కానీ బట్లర్ 27 బంతుల్లో 37 పరుగులు చేసిన తర్వాత అశ్విని కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కానీ, కెప్టెన్ గిల్ ఒక చివరన నిలిచాడు. ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో, కెప్టెన్ గిల్ 43 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడగా, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 15 బంతుల్లో 28 పరుగులు చేశాడు. చివరికి జెరాల్డ్ కోట్జీ 6 బంతుల్లో 12 పరుగులు చేసి కి ఉత్కంఠభరితమైన విజయాన్ని అందించాడు.

### హార్దిక్ చేసిన ఒక తప్పు ఖరీదైనదిగా నిరూపితం..

ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చేసిన తప్పుకు మొత్తం జట్టు పరిణామాలు అనుభవించాల్సి వచ్చింది. నిజానికి, వర్షం కారణంగా దెబ్బతిన్న ఈ మ్యాచ్‌లో గుజరాత్ గెలవడానికి చివరి ఓవర్‌లో 15 పరుగులు అవసరం. కానీ, కెప్టెన్ హార్దిక్ స్లో ఓవర్ రేట్ కారణంగా, జట్టు చివరికి 30 గజాల సర్కిల్‌లో అదనపు ఫీల్డర్‌ను ఉంచాల్సి వచ్చింది. దాని కారణంగా జట్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. అదే సమయంలో, హార్దిక్ చివరి బంతికి రనౌట్ అయ్యే గొప్ప అవకాశం కూడా వచ్చింది. కానీ, అతను బంతిని స్టంప్స్‌పై కొట్టడంలో విఫలమయ్యాడు. హార్దిక్ బంతిని స్టంప్స్‌పై కొట్టి ఉంటే, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లి ఉండేది. ఆ తర్వాత ఫలితం ముంబైకి అనుకూలంగా ఉండేది

### ముంబై ఇండియన్స్ బ్యాట్స్‌మెన్స్ నిరాశ..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో భాగంగా 56వ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు వచ్చిన ముంబై ఇండియన్స్ (%వీ× జం +ు%), తమ ఓపెనర్ల నుంచి అద్భుతమైన ఆరంభాన్ని ఆశించింది. కానీ, మొదటి ఓవర్ రెండవ బంతికే, మహ్మద్ సిరాజ్ 2 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ర్యాన్ రికెల్టన్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. ఆ తర్వాత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా 8 బంతుల్లో 7 పరుగులు చేసి ఔటయ్యాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత, ముంబైకి సూర్యకుమార్ యాదవ్, విల్ జాక్స్ కలిసి సాధించిన భారీ భాగస్వామ్యం చాలా అవసరం. వీరిద్దరూ మూడో వికెట్‌కు 43 బంతుల్లో 71 పరుగులు జోడించారు. ఒక దశలో, ఇద్దరు బ్యాట్స్‌మెన్ ముంబై (ని మ్యాచ్‌లో తిరిగి తీసుకువచ్చారు. కానీ, సూర్యకుమార్ యాదవ్ (35) అవుట్ అయిన తర్వాత, విల్ జాక్స్ (53) కూడా ఆ తర్వాతి ఓవర్‌లోనే ఔటయ్యాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో ముంబై మిడిల్ ఆర్డర్ పూర్తిగా కుప్పకూలింది. 3 వికెట్లకు 97 పరుగులు చేసిన ముంబై ఒక దశలో 7 వికెట్లకు 123 పరుగులు చేసింది. కానీ, దీపక్ చాహర్, కార్బిన్ బాష్ ఎనిమిదో వికెట్‌కు 20 బంతుల్లో విలువైన 27 పరుగులు జోడించి ముంబైను 20 ఓవర్లలో 150 మార్కును దాటడంలో సహాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో బాష్ 22 బంతుల్లో 27 పరుగులు జోడించాడు.

## ధోనీ ఆడుతున్నాడా..

# ఇరు జట్లలో కీలక ఆటగాళ్లు వీరే






ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఐదు విజయాలతో 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఇక, మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తే కేకేఆర్ ప్లే ఆఫ్స్‌కు చేరుకునే వీలుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడుతోంది. గతేడాది ఛాంపియన్ అయిన కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రస్తుత సీజన్‌లో తడబడుతోంది. కేకేఆర్ ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశాలు కేవలం 15 శాతం మాత్రమే ఉన్నాయి. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఐదు విజయాలతో 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఇక, మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ కేకేఆర్ తప్పక గెలవాల్సిందే. అలా గెలిచినా ప్లే ఆఫ్స్‌కు చేరుతుందని కచ్చితంగా చెప్పలేం. ఈ నేపథ్యంలో ఈ రోజు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడుతోంది ప్రస్తుతం రెండు జట్లు ఈడెన్ గార్డెన్స్‌లో సాధన చేస్తున్నాయి. ఈ ప్రాక్టీస్ సెషన్‌కు ధోనీ గైర్హాజరయ్యాడు. స్టేడియంకు ప్రాక్టీస్ కోసం రాలేదు. దీంతో ఈ మ్యాచ్‌లో ధోనీ ఆడడం అనుమానంగా మారింది. అయితే మ్యాచ్‌లో మాత్రం ధోనీ ఆడతాడని సమాచారం. తాజా మ్యాచ్ చెన్నై కంటే కేకేఆర్‌కు అత్యంత కీలకం. ఎందుకంటే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఐపీఎల్-2025 నుంచి నిష్క్రమించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలను కోల్పోయింది. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉన్న చెన్నై ఇక ఈ టోర్నీలో నామమాత్రంగానే ఆడుతోంది. కోల్‌కతా జట్టులో చక్కటి సామర్థ్యం గల బ్యాటర్లు ఉన్నా వారు ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్నారు. సునీల్ నరైన్, గుర్బాజ్, వెంకటేష్ అయ్యర్, రింకూ సింగ్ పరుగులు చేయడంలో తడబడుతున్నారు. రహానే, రఘువంశీ, రస్సెల్ మాత్రమే పరుగులు చేస్తున్నారు. మరోవైపు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, హర్షిత్ రానా, వైభవ్ అరోరాతో కూడిన బౌలింగ్ విభాగం పటిష్టంగా కనబడుతోంది. ఇక, సీఎస్కేలో ఒక్క ఆటగాడు కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడడం లేదు. కేవలం ధోనీ క్రేజ్ మీదనే ఆ టీమ్ పయనం సాగిస్తోంది. ఇటీవలి మ్యాచ్‌ల్లో ఆయుష్ మాత్రే, రవీంద్ర జడేజా, సామ్ కర్రన్ పరగులు చేశారు. బ్యాటింగ్‌తో పోలిస్తే బౌలింగ్ విభాగం కాస్తా ఫర్వాలేదనే చెప్పాలి.

### తుది జట్లు:

కోల్‌కతా నైట్ రైడర్స్ (అంచనా): సునీల్ నరైన్, రహ్మనుల్లా గుర్బాజ్, అజింక్య రహానే, రఘువంశీ, వెంకటేష్ అయ్యర్, రింకూ సింగ్, ఆండ్రూ రస్సెల్, పావెల్, అనుకూల్ రాయ్, హర్షిత్ రానా, వైభవ్ అరోరా చెన్నై సూపర్ కింగ్స్ (అంచనా): ఆయుష్ మాత్రే, షేక్ రషీద్, సామ్ కర్రన్, రవీంద్ర జడేజా, బ్రేవిస్, శివమ్ దూబే, దీపక్ హుడా, ధోనీ, పతిరణ, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్



# హెల్తీగా, ఫిట్‌గా ఉండాలని అనుకుంటున్నారా..



శారీరకంగా ఆరోగ్యంగా కనిపించడమే కాదు, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. హెల్తీగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి ఈ సింపుల్ టిప్స్ పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వీటిని పాటించడం వల్ల వ్యాధులు శరీరానికి దూరంగా ఉంటాయని అంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు తరచూ అంటారు. ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదంటారు. కాబట్టి మీరు మీ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కేవలం శారీరకంగా ఆరోగ్యంగా కనిపించడమే కాకుండా, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. ఈ సింపుల్ టిప్స్ పాటించడం వల్ల హెల్తీగా, ఫిట్‌గా ఉండటమే కాకుండా వ్యాధులు శరీరానికి దూరంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### సమతుల్య ఆహారం తీసుకోండి

మీరు రోజంతా తినే ఆహారం మీ శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఎల్లప్పుడూ సమతుల్య ఆహారం తీసుకోవడానికి ప్రయత్నించండి. మీ ఆహారంలో అన్ని విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు సమతుల్య పరిమాణంలో ఉండటం చాలా ముఖ్యం. దీనితో పాటు, రోజుకు కనీసం 4 లీటర్ల నీరు తాగాలి. మీ ఆహారంలో ఆకు కూరలు, తాజా పండ్లను చేర్చుకోండి. ఉదయం అల్పాహారం తప్పకుండా తీసుకోండి.

క్రమబద్ధమైన జీవనశైలి

ఆరోగ్యంగా ఉండటానికి, క్రమబద్ధమైన జీవనశైలిని కలిగి ఉండటం చాలా ముఖ్యం. మీరు శారీరకంగా చురుకుగా ఉండాలంటే ఇంటి పనులలో సహాయం చేయాలి. ఎక్కువసేపు కూర్చోకుండా లేదా నిద్రపోకుండా ఉండటానికి ప్రయత్నించండి. ఎందుకంటే ఇది ఊబకాయానికి దారితీస్తుంది. అనేక వ్యాధులకు కారణమవుతుంది. ప్రతిరోజూ ఉదయం లేవడం, పళ్ళు తోముకోవడం, స్నానం చేయడం, పోషకమైన ఆహారం తినడం చాలా కష్టమైన పనిలా అనిపించవచ్చు, కానీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. మీరు క్రమం తప్పకుండా స్నానం చేయాలి, మీ గోళ్లను కత్తిరించి శుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతిరోజూ 7 గంటలు నిద్రపోవాలి.

### క్రమం తప్పకుండా వ్యాయామం

చాలా మంది ఎక్కువగా ఒత్తిడికి గురవుతుంటారు. ఇది అనేక రకాల అనారోగ్యాలకు దారితీస్తుంది. అటువంటి పరిస్థితిలో, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా, మీరు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగలరు.

### ఆరోగ్య పరీక్షలు

ఆరోగ్యంగా ఉండటానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ విధానం వల్ల ఏదైనా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. సరైన సమయంలో చికిత్స తీసుకోని ఆరోగ్యంగా ఉండవచ్చు.

### మత్తు పదార్థాలు మానేయండి

ధూమపానం లేదా మద్యం సేవించడం వల్ల మీ ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి. ఇది మాత్రమే కాదు, ధూమపానం మీ చర్మాన్ని కూడా దెబ్బతీస్తుంది, దీని కారణంగా మీరు సమయానికి ముందే వృద్ధాప్యంగా కనిపించడం ప్రారంభిస్తారు. కాబట్టి అలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.

### మానసిక ఆరోగ్యం

ఒక వ్యక్తి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడని అర్థం. అప్పుడే మీరు ఏ పని అయినా చేసుకోగలరు. కాబట్టి మీరు సానుకూలంగా ఆలోచించి ధ్యానం చేయండి. ఇలా చేయడం వల్ల మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు.

# ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తింటే
# 5 అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..



మీరు ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి పండు తింటే అది శరీరానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం నుండి ఆధునిక శాస్త్రం వరకు ఉదయం పూట సూపర్ ఫుడ్‌గా బొప్పాయిని పరిగణిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా చర్మం, బరువు, రోగనిరోధక వ్యవస్థ, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల నుండి కూడా రక్షిస్తుంది. బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌లు, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి శక్తి కేంద్రంగా పనిచేస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల కలిగే 5 అద్భుతమైన ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

### 1. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది

బొప్పాయిలో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఆహారాన్ని త్వరగా, బాగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. మీరు మలబద్ధకం, గ్యాస్ లేదా అజీర్ణంతో బాధపడుతుంటే ఉదయం బొప్పాయి తినడం వల్ల ఉపశమనం పొందుతారు.

### 2. బరువు తగ్గడానికి ఉపయోగం

బొప్పాయిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఇది మళ్లీ మళ్లీ తినాలనే కోరికను నిరోధిస్తుంది. దీని జీర్ణ ఎంజైములు కొవ్వు విచ్ఛిన్నానికి కూడా సహాయపడతాయి.

### 3. చర్మాన్ని ప్రకాశవంతంగా చేస్తుంది

బొప్పాయిలో విటమిన్లు ఎ, సి, ఇ పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని పోషిస్తాయి. ఉదయం దీనిని తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుండి శుభ్రమవుతుంది. తద్వారా మొటిమలు, మచ్చలు, పొడిబారడం తొలగిపోతుంది.

### 4. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది


ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ లభిస్తుంది. అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు తగ్గుతాయి.

### 5. క్యాన్సర్ నుండి రక్షణ

బొప్పాయిలో ఉండే లైకోపీన్, ఫ్లేవనాయిడ్లు క్యాన్సర్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఇవి క్యాన్సర్ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి.

# మళ్లీ జన్మనిచ్చారు

ఆ



బిడ్డకు జన్మనివ్వడంతో తన జన్మ తరించిందని భావిస్తుంది అమ్మ. ఆ బిడ్డకు గోరంత కష్టం వచ్చినా కొండంత బాధపడిపోతుంది. చిన్నగా నసిగినా పెద్దగా ఆందోళన చెందుతుంది. అదే బిడ్డకు ప్రాణాల మీదికి వచ్చిందంటే.. అమ్మ దుఃఖం కట్టలు తెచ్చుకుంటుంది. దేవుళ్లను నిలదీస్తుంది. అవసరమైతే.. అపర సంజీవనిగా మారి ఆయువు పోస్తుంది. అలాంటి తల్లులే వీళ్లు. కిడ్నీలు విఫలమై మంచానికి పరిమితమైన తమ బిడ్డలకు తమ కిడ్నీ ప్రసాదించి పునర్జన్మనిచ్చారు. కొడిగడుతున్న వారి బతుకులకు ఊపిరులూదారు. అమ్మదనానికి అసలైన చిరునామాగా నిలిచిన షకీలా ఖాన్, రాజ్యలక్ష్మి, కల్యాణి ద్విభాష్యం, నిర్మలను జిందగీ పలకరించింది. ఆ విశేషాలే ఇవి..

బిడ్డకంటే ఏం ఎక్కువ?



నా కూతురు వసంతకు మూడేండ్ల కిందట సుస్తీ చేసింది. రోజుల వ్యవధిలోనే బాగా నీరసించి పోయింది. దవాఖానకు తీసుకెళ్లాం. వైద్యులు పరీక్షలు చేసి.. అమ్మాయి కిడ్నీలు దెబ్బతిన్నాయని చెప్పారు. మాట వినగానే కాళ్ల కింద భూకంపం వచ్చినంత పనైంది. పగవాడికి కూడా రావొద్దనుకునే కష్టం నా బిడ్డకు వచ్చిందని తల్లడిల్లిపోయాను. తనను కాపాడాలని మొక్కని దేవుళ్లు లేరు. ఆ దేవుడి మీదే భారం వేసి ఎనిమిది నెలలపాటు డయాలసిస్ చేయించాం. మా అల్లుడే దగ్గరుండి ఆమెను చూసుకున్నాడు. నా కూతురు అవస్థ చూసి నేను కుమిలిపోయేదాన్ని. కిడ్నీ మార్పిడి ఒక్కటే పరిష్కారం అని వైద్యులు చెప్పారు. దగ్గరి రక్త సంబంధీకులు కిడ్నీ దానం చేస్తే మంచిదని సూచించారు. ఆ మాట వినగానే నా కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డాను. ఇంట్లోవాళ్లు కూడా నా నిర్ణయానికి మద్దతుగా నిలిచారు. శస్త్రచికిత్స చేసి నా కిడ్నీ కూతురుకు అమర్చారు. ప్రస్తుతం తన ఆరోగ్యం కుదుటపడింది. నేను కూడా బాగానే ఉన్నా. కన్నబిడ్డ ఆరోగ్యం కన్నా.. ఏ తల్లి మాత్రం ఏం కోరుకుంటుంది.

### పెండ్లికి ముందు పిడుగు

మాది హైదరాబాద్. నా కూతురు పేరు లక్ష్మీభావజ. ఆ రోజు నా బిడ్డ పుట్టినరోజు. వేడుకగా జరుపుకొంటున్నాం. అప్పటికి కొన్నాళ్ల ముందే నా కూతురు పెండ్లి నిశ్చయమైంది. ముహూర్తాలు కూడా పెట్టుకున్నాం. ఇంట్లో అంతా సందడే! అలాంటి ఆనందకర సమయంలో ఉన్నట్టుండి నా కూతురు అనారోగ్యానికి గురైంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాం. వెంటనే ఐసీయూకి షిఫ్ట్ చేయాలన్నారు వైద్యులు. నాకేం పాలుపోలేదు. ఏవో కొన్ని పరీక్షలు చేశారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పగానే నా ప్రాణం పోయినంత పనైంది. 'కిడ్నీ మార్పిడి చేస్తే మీ అమ్మాయికి ఏ ఆపదా లేద'ని డాక్టర్లు చెప్పడంతో కాస్త ఊరట చెందాను. మా ఆయన కిడ్నీ ఇవ్వడానికి ముందుకువచ్చారు. అయితే అది మ్యాచ్ కాదని వైద్యులు చెప్పడంతో నా కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డాను. పరీక్షల తర్వాత శస్త్రచికిత్స చేశారు. అమ్మాయి ఆస్పత్రిలో చేరిందని తెలియగానే మా కాబోయే వియ్యాలవారు కూడా మాకు అండగా నిలిచారు. మాకు భరోసా ఇచ్చారు. రెండేండ్లపాటు ఆగారు. కిడ్నీ మార్పిడి తర్వాత ఆరు నెలల్లో పూర్తిగా కోలుకున్నాం. నేను తిరుమల వెళ్లి అలిపిరి నుంచి కాలినడకన స్వామిని దర్శించుకున్నా. అరుణాచలం గిరి ప్రదక్షిణ కూడా చేశాను. ఇప్పుడు ఇద్దరికీ ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. మా అమ్మాయి, అల్లుడు జర్మనీలో హాయిగా ఉంటున్నారు. నా బిడ్డ సంతోషం కోసం తల్లిగా ఆ మాత్రం చేయలేనా!

కల్యాణి ద్విభాష్యం

### నీకేం కానివ్వనంది..

ఆ క్షణంలో అమ్మ లేకుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయంగా ఉంది. మాది గుంటూరు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. పీజీలో ఉంటున్నా. హాస్టల్ ఫుడ్ పడకపోవడం, బయట ఫాస్ట్‌ఫుడ్, లైఫ్‌స్టయిల్ వీటన్నిటి కారణంగా నాకు తెలియకుండానే ఆరోగ్యం క్షీణించింది. అప్పుడప్పుడు వాంతులు, విరేచనాలు అయ్యేవి. కరోనా లాక్‌డౌన్ టైమ్‌లో వైద్యులను సంప్రదించాను. పరీక్షలు చేసి కిడ్నీలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఆ మాట వినగానే చాలా కుంగిపోయాను. ఇక నేను బతకను అనుకున్నాను. నైరాశ్యంలో కూరుకుపోయిన నాకు అమ్మ షకీలా ఖాన్ అండగా నిలిచింది. 'నేను ఉన్నంతవరకు నీకేం కానివ్వను' అని భరోసా ఇచ్చింది. తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చింది. నెల రోజులపాటు అమ్మకు రకరకాల పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స చేసి అమ్మ కిడ్నీ నాకు అమర్చారు. జన్మ ఇచ్చినందుకే తల్లికి జీవితకాలం రుణపడాలి. అలాంటిది తన ప్రాణాలను పణంగా పెట్టి నాకు మరో జన్మ ప్రసాదించిన మా అమ్మకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలను. ఇప్పుడు నేను తీసుకుంటున్న ప్రతిశ్వాస అమ్మ మళ్లీ ప్రసాదించిందే! ఈ బతుకంతా అమ్మకే అని ఫిక్సయ్యాను.

### నా బిడ్డను కాపాడుకుంటా..

నా చిన్నకొడుకు సాయి యశేశ్‌కు పదేండ్లు ఉన్నప్పుడే కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు. ఆ విషయం తెలియగానే కుటుంబమంతా విషాదంలో మునిగిపోయాం. ఇంత చిన్నవయసులో డయాలసిస్ చేస్తే ఇబ్బందని చెప్పడంతో వెంటనే నా కిడ్నీని తనకు ఇచ్చాను. అప్పటినుంచి వాడి ఆరోగ్యం కుదుటపడింది. వాడి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాను. కరోనా ప్రభావం మూలాన నా కొడుకు ఆరోగ్యం క్షీణించింది. అది మళ్లీ వాడి కిడ్నీలపై ప్రభావం చూపింది. ఈసారి ఇంట్లోవాళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కూడా నా కొడుకు వద్దని డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నేను జన్మనిచ్చిన నా బిడ్డను కాపాడుకోవడం నా కర్తవ్యం.

## చెట్లు మాత్రమే ఆక్సిజన్ ఇస్తాయనుకోకండి..!
# అంతకు మించి ఇవి కూడా..!



ఈ భూమిపై ఆక్సిజన్ ఎలా లభిస్తుంది? ఇంకెలా? చెట్లు, అడవులవల్లే కదా అంటుంటారు చాలా మంది. కానీ అంతకు మించి ఈ వాయువును విడుదల చేసే వనరులు కూడా ఉన్నాయని మీకు తెలుసా? అవేవో కాదు, సముద్రాలు. మనం శ్వాసించే ఆక్సిజన్‌లో 80 శాతం వరకు వీటి ద్వారానే లభిస్తుందని, సముద్రాల్లోని ఫైటో ప్లాంక్టన్ వంటి సూక్ష్మజీవులే ఇందుకు ప్రధాన కారణమని నాసా, నేషనల్ ఓషనోగ్రఫిక్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధనలు పేర్కొంటున్నాయి.

**వరల్డ్స్ బెస్ట్ ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్.. శివపార్వతుల పెళ్లి చూస్తున్నట్లే**



**ఉందంటున్న నెటిజన్లు.. ఆ ఆలోచనే అద్భుతం గురూ..(వీడియో)**

పరిశోధనల ప్రకారం.. సముద్రాల్లోని ఫైటోప్లాంక్టన్ సైనో బ్యాక్టీరియా , సముద్ర పాచి వంటి సూక్ష్మ జీవులు ఆక్సిజన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ చిన్న చిన్న జీవులు సముద్ర ఉపరితలంపై తేలుతూ.. సూర్యకాంతిని ఉపయోగించుకొని ఫొటోసింథెసిస్ ప్రాసెస్ ద్వారా ఆక్సిజన్ ను ప్రొడ్యూస్ చేసి, రిలీజ్ చేస్తాయి. అంతేకాదు ఇవి కార్బన్ డై ఆక్సైడ్ ను గ్రహించి, ఆక్సిజన్‌ను విడుదల చేయడం విశేషం. భూమిపై మానవులు, ఇతర జీవుల మనుగడకు ఈ ప్రక్రియ చాలా అవసరం అంటున్నారు శాస్త్రవేత్తలు.

**వధువు ఉండదు.. వరుడు ఉండడు.. పెళ్లి మాత్రం జరుగుతుంది.!**

ఫైటో ప్లాంక్టన్ సూక్ష్మ జీవులు సముద్రాల్లోనే అత్యధికంగా ఉండటంవల్ల చెట్లతో పోలిస్తే ఇక్కడే ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్ ఉత్పత్తి అవుతున్నట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు. అమెజాన్ వంటి అడవులు ఆక్సిజన్ ఉత్పత్తిలో ముఖ్యమైనవే, అయినప్పటికీ అవి సుమారు 20% ఆక్సిజన్‌ను మాత్రమే అందిస్తాయని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. పైగా భూమిలో 71% వైశాల్యంలో సముద్రాలే విస్తరించి ఉండటం, ఫైటోప్లాంక్టన్ వంటి సూక్ష్మ జీవులకు నిలయంగా మారడం కారణంగా అడవులకంటే కూడా ఎక్కువగా (80 %) ఆక్సిజన్ ఇక్కడే ఉత్పత్తి అవుతోంది. సముద్ర ఆహార గొలుసులోనూ ఫైటోప్లాంక్టన్ సూక్ష్మ జీవులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఎందుకంటే ఇవి ఇతర సముద్ర జీవులకు ఆహార వనరులుగా ఉపయోగపడతాయి.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com